నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ ఆదివారం 28-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 197 పేజీలు: 4 వెల: రూ.1/-

రెండోరోజూ కొనసాగిన ప్రధాని మోడీ పర్యటన

ఈశ్వరిపుర్ గ్రామంలో జెశోరేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు
అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన వెండి కిరీటం సమర్పణ

ఢాకా,మార్చి27(ఆర్ఎన్ఎ): బంగ్లాదేశ్‌లో ఉన్న శక్తి పీఠం జెశోరేశ్వరి కాళీ ఆలయాన్ని శనివారం ప్రధాని మోదీ సందర్శించారు. రెండు రోజుల పాటు బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న ఆయన ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్‌కిరా జిల్లాలోని ఈశ్వరిపుర్ గ్రామంలో జెశోరేశ్వరి ఆలయం ఉన్నది. దుర్గామాతకు చెందిన 51 శక్తి పీఠాల్లో జెశోరేశ్వరి ఆలయం కూడా ఒకటి. జెశోర దేవి పేరు మీద ఆ ఆలయం వెలసినది. బంగ్లాదేశ్‌లో ఉన్న ప్రసిద్ధ ఆలయాల్లో ఇది ఒకటి. ప్రతి ఏడాది వేల సంఖ్యలో భారత్‌లోని హిందువులు ఈ ఆలయాన్ని విజిట్ చేస్తుంటారు. కాళీ పూజ జరిగే రోజున ఇక్కడకు భారీ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. 13వ శతాబ్దంలో ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ జరిగినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. లక్ష్మణసేన, ప్రతాపాధిత్య ఈ ఆలయ పునర్ నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన శనివారం కొనసాగనుంది. నైరుతి షాట్ఖిరా, గోపాల్‌గంజ్‌లోని జశోరేశ్వరి, ఓర్కాండి దేవాలయాల్లో పూజలు చేయనున్నారు. అలాగే గోపాల్‌గంజ్ జిల్లాలోని తుంగిపారలోని షేక్ ముజిబుర్ రెహ్మాన్ సమాధిని సందర్శించి, నివాళులర్పించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం బంగ్లాదేశ్‌కు వెళ్లిన ప్రధాని తొలిరోజు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెండో రోజైన శనివారం ఉదయాన్నే సట్‌ఖారీ జిల్లా ఈశ్వర్‌పూర్‌లోని జెశోరేశ్వరీ కాళీ టెంపుల్‌ను సందర్శించారు. అక్కడ అమ్మవారికి పూజలు నిర్వహించి చేతితో తయారు చేసిన కిరీటాన్ని తొడిగారు. వెండిపై బంగారం కోటింగ్ వేసిన తీగలను చేతిలో అల్లడం ద్వారా ఈ కిరీటాన్ని తయారు చేశారు. సంప్రదాయ కళారీతిలో ఈ కిరీటాన్ని అల్లడానికి మూడు వారాలకు పైగా సమయం పట్టింది. జెశోరేశ్వరీ అమ్మవారికి పూజల అనంతరం మాట్లాడిన ప్రధాని.. తనకు ఇవాళ కాళీ మాత దర్శన భాగ్యం కలిగిందన్నారు. కరోనా మహమ్మారితో పోరాడుతున్న ప్రపంచ మానవాళికి ఆ గండం నుంచి విముక్తి కల్పించమని తాను కాళీ మాతను కోరుకున్నట్లు ప్రధాని వెల్లడించారు. బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఆలయ పరిసరాల్లో ఒక కమ్యూనిటీ హాల్‌ను అవసరమని, ఆ హాల్‌ను నిర్మాణాన్ని భారత ప్రభుత్వమే చేపడుతుందని చెప్పారు. కాళీ మేళా సందర్భంగా బంగ్లాదేశ్ నుంచి, భారత సరిహద్దుల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఇక్కడి తరలివస్తారని, అలా వచ్చే భక్తులకు కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు. సామాజిక, మత సంబంధమైన, విద్యా సంబంధమైన పలు కార్యక్రమాలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తుఫాన్‌ల లాంటి విపత్తులు సంభవించినప్పుడు కమ్యూనిటీ హాల్ ఒక షెల్టర్‌గా ఉపయోగపడుతుందన్నారు.

నిలకడగా రాష్ట్రపతి కోవింద్ ఆరోగ్యం

-ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోడీ ఆరా

న్యూఢిల్లీ,మార్చి27(ఆర్ఎన్ఎ): దేశ ప్రథమ పౌరుడు, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఛాతీలో అసౌకర్యం కారణంగా ఆయన దిల్లీలోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రెఫరల్ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. వైద్యులు ఆయనకు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి అబ్జర్వేషన్‌లో ఉంచారు. రాష్ట్రపతి ఆరోగ్యంపై శనివారం ఉదయం ఆర్మీ ఆసుపత్రి బులిటెన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పిన ఆసుపత్రి వర్గాలు.. తదుపరి వైద్య పరీక్షల నిమిత్తం రాష్ట్రపతిని ఎయిమ్స్‌కు పంపించనున్నట్లు తెలిపాయి. రాష్ట్రపతి ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిన వెంటనే బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ.. కోవింద్ కుమారుడితో ఫోన్లో మాట్లాడారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆర్మీ ఆసుపత్రికి వెళ్లి రాష్ట్రపతిని పరామర్శించారు. తన క్షేమంగా ఉండాలని ప్రార్థించిన వారికి కోవింద్ ట్విటర్ వేదికగా కృతజ్ఞతలు తెలియజేశారు.

హోలీ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

హైదరాబాద్,మార్చి27 (ఆర్ఎన్ఎ):తెలంగాణలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో హోలీ వేడుకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. హోలీ వేడుకలకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదని, కోవిడ్ కేసులు విజృంభిస్తున్న సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఆంక్షలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాదు గేటెడ్ కమ్యూనిటీల వేడుకలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఈవెంట్స్ ఆర్గనైజర్లకు, హాస్టల్ నిర్వాహకులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఖచ్చితంగా మాస్కు లు, భౌతిక దూరం పాటించాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

నిర్మాణాత్మక చర్చలకు చట్టసభలు వేదికలు కావాలి

అర్థవంతమైన చర్చలతో సమస్యలకు పరిష్కారం
మహనీయుల జీవిత పాఠాలతో ముందుకు సాగాలి
నూకల నరోత్తం రెడ్డి స్మారకోపన్యాసంలో వెంకయ్యనాయుడు

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): చట్టసభలు నిర్మాణాత్మక, ప్రయోజనాత్మక చర్చలకు వేదికలు కావాలే తప్ప, అంతరాయాలకు కాదని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు తెలిపారు. ప్రధానంగా ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరిగినప్పుడే ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. ప్రముఖ విద్యావేత్త, పత్రికా సంపాదకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి నూకల నరోత్తమ్ రెడ్డి శతజయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా శతజయంతి కమిటీ సభ్యులను అభినందించిన ఆయన, ఇలాంటి మహనీయుల జీవితం గురించి, సమాజానికి వారు చూపిన బాట గురించి ముందు తరాలకు తెలుసుకోవాలని, అందుకోసం ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని చెప్పారు.ఆయన సంగీతంలోనూ ప్రావీణ్యం పొందారని గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని వెంకయ్యనాయుడు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాన్ని, చరిత్రను విస్మరిస్తున్నాం. ఇది మంచి పరిణామం కాదు. జర్నలిస్టులు విలువలు పాటించేలా పని చేయాలి. పత్రికలు సత్యానికి దగ్గరగా.. సంచలనాలకు దూరంగా ఉండాలి. సాంకేతికతపై యువత దృష్టి పెట్టాలి. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా మన నూతన విద్యావిధానం ఉండాలి. యువతను దేశ సంపదగా భావించి ముందుకెళ్లాలి. పార్లమెంట్‌కు 10 శాతం సభ్యులు కూడా హాజరు కావట్లేదు. ప్రజలు ఎందుకు సభలకు పంపుతున్నారో ఆలోచించాలి. రాజ్యసభలో కూడా క్రమశిక్షణ గురించి చెప్పడం బాధగా అనిపిస్తోంది. రాజ్యసభలో మాతృభాషలో మాట్లాడేందుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. గతంలో జనం శ్రేయస్సు కోసం సంఘాలు పెట్టేవారన్నారు. చిన్నతనం నుంచే మంచి ప్రతిభ కనపరచిని నరోత్తమ్‌రెడ్డి సమాజసేవ మీద దృష్టి సారించి, రాజకీయాల్లోకి వచ్చారన్నారు. నిజాం వ్యతిరేక పోరాటం మొదలుకుని ప్రజలను చైతన్య పరిచే అనేక ఉద్యమాల్లో వారు కీలక పాత్ర పోషించారని చెప్పారు. నురవరం ప్రతాపరెడ్డి ప్రారంభించిన గోలకొండ పత్రికకు సంపాదకులుగా ఆ పత్రికకు ప్రజాభిమాన్ని సంపాదించిపెట్టడంలో కీలక పాత్ర పోషించారన్న వెంకయ్యనాయుడు.. నురవరం నెలకొల్పిన విలువలు, ప్రామాణికత ఏ మాత్రం తగ్గకుండా పత్రికను ముందుకు తీసుకుపోయారని తెలిపారు. రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యులుగా సేవలందించిన నరోత్తమ్‌రెడ్డి అనేక కీలక చర్చల్లో ప్రజా గళాన్ని వినిపించారని ఉపరాష్ట్రపతి చెప్పారు. ఆయన స్ఫూర్తిని ఈ తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. విద్యారంగం పట్ల నూకల నరోత్తమ్‌రెడ్డి అమిత శ్రద్ధను కనబరిచారని, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రెండు దశాబ్దాలు సిండికేట్ సభ్యుడిగా, మూడేండ్ల పాటు ఉపకులపతిగా సేవలు అందించి విశ్వవిద్యాలయ ప్రమాణాలు పెంచేందుకు కృషి చేశారని తెలిపారు. 56 ఏళ్ళ క్రితం రాజ్యసభలో నరోత్తమ్‌రెడ్డి ప్రసంగాలను వింటే.. దేశంలో విద్యాప్రమాణాలను పెంచేందుకు ఆయన పడిన తపన మనకు అవగతమౌతుందన్నారు. ఆనాటి నాయకులు పాటించిన ప్రమాణాలు, వారు అనుసరించిన విలువలు, నీతి-నిజాయితీకి కట్టుబడి సామాజిక అభ్యున్నతే ధ్యేయంగా వారు చేసిన కృషి చిరస్మరణీ యమైనదన్న ఆయన, ఇలాంటి నాయకుల జీవితాలను యువత అధ్యయనం చేయాలని, వారు జీవితాంతం పాటించిన విలువలు, దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నూకల నరోత్తమ్‌రెడ్డి శతజయంతి సంచికను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి మహమ్మూద్ అలీ, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య శివారెడ్డి, శతజయంతి కమిటీ కన్వీనర్ నూకల రాజేంద్రరెడ్డి సహా నూకల నరోత్తమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌకుంట్లను మండలంగా ఏర్పాటు చేయండి

-నియోజకవర్గ సమస్యలపై సిఎం కెసిఆర్‌కు వినతిపత్రం

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించారు. నియోజకవర్గంలోని కౌకుంట్ల గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎకో టూరిజం అభివృద్ధిపై మంత్రుల సమీక్ష

హైదరాబాద్, మార్చి27: రాష్ట్రంలో ఏకో ? టూరిజం అభివృద్ధిపై పర్యాటక ? అటవీశాఖ ఉన్నతస్థాయి అధికారులతో పర్యాటకశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీశాఖ పరిధిలోని టూరిజం ప్రాంతాల్లో పర్యాటకుల సౌకర్యాలు, మౌలిక సదుపాయాల కల్పనపై మంత్రులు అటవీ, పర్యాటక శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న ఏకో టూరిజం అభివృద్ధి పై చర్చించారు.

కవ్వాల్ జంగిల్ సఫారీ, లక్నవరం, పాకాల చెరువులు, బోగత జలపాతం, మల్లూర్ ట్రెక్కింగ్ పాత్ వే లు, ఫర్హాబాద్ ఎకో సర్యూట్ పార్కుల అభివృద్ధి పై ప్రత్యేకంగా చర్చించారు. రిజర్వాయర్లలో టూరిజాన్ని అభివృద్ధి చేసి పర్యాటకుల కోసం మరిన్ని బోట్లు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టైగర్ రిజర్వ్ జోన్లు, వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు, శాంక్చూరీలు ఉన్న చోట అటవీశాఖ అనుమతులు తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కడెం రిజర్వాయర్‌లో కొత్త బోట్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రేఖా శ్యానాయక్ కోరగా తగిన ఏర్పాట్లు చేయాలని పర్యాటకశాఖ అధికారులకు మంత్రులు సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రేఖా శ్యానాయక్, విఠల్ రెడ్డి, రాథోడ్ బాపురావు , దివాకర్ రావు, ఆత్రం సక్కు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డితో పాటు ప్రభుత్వ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు , అటవీశాఖ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి, పీసీసీఎఫ్ ఆర్ శోభ, పర్యాటక శాఖ కార్యదర్శి కేఎస్. శ్రీనివాస రాజు, పీసీసీఎఫ్ సోషల్ ఫారెస్ట్రీ ఆర్.యం. డోబ్రియల్, పర్యాటక శాఖ ఎండీ మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లాక్‌డౌన్‌తో కరోనా కట్టడి చేయలేం

ఢిల్లీ ప్రజలకు రిజిస్ట్రేషన్ లేకుండానే వ్యాక్సిన్
ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యేంద్ర జైన్

న్యూఢిల్లీ,మార్చి27(ఆర్ఎన్ఎ): దేశ రాజధానిలో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్న తరుణంలో దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాక్సిన్ ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ మేరకు దిల్లీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్ శనివారం ఓ సమావేశంలో వెల్లడించారు. 'వ్యాక్సిన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలామందికి సాంకేతిక పరిజ్ఞానం ఉండదు. కాబట్టి ఇక నుంచి మధ్యాహ్నం 3గంటల నుంచి 9గంటల వరకు రిజిస్ట్రేషన్ లేకుండానే వ్యాక్సిన్ వేసేందుకు నిర్ణయించాం' అని తెలిపారు. 'కరోనా వైరస్ కేసులను అరికట్టేందుకు లాక్‌డౌన్ మాత్రమే పరిష్కారం కాదు. కాబట్టి ప్రస్తుతం దిల్లీలో లాక్‌డౌన్ విధించే అవకాశాలు లేవు. ఇప్పటికే ఒకసారి లాక్‌డౌన్ విధించాం. అప్పుడు వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుందో ఎవరికీ తెలియదు కాబట్టి విధించడంలో అర్థం ఉంది. అప్పట్లో 14 రోజులు లేదా 21 రోజులు పెంచుతూ దేశాన్ని లాక్‌డౌన్‌లో ఉంచినప్పటికీ వైరస్ వ్యాప్తి మాత్రం ఆగలేదు. కాబట్టి వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు లాక్‌డౌన్ అనేది పరిష్కారం కాదు. ప్రస్తుతం నిత్యం 90వేల కరోనా పరీక్షలు చేస్తున్నాం. అంతేకాకుండా కాంటాక్ట్ ట్రేసింగ్ కూడా చేసి సదరు వ్యక్తుల్ని ఐసోలేషన్‌లో ఉంచుతున్నాం. ఇక ఆస్పత్రుల్లోనూ పడకలు తగినన్ని అందుబాటులో ఉన్నాయి. కేవలం 20శాతం మాత్రమే నిండి ఉన్నాయి. ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలిస్తున్నాం. అవసరమైతే పడకల సంఖ్యను పెంచుతాం' అని జైన్ తెలిపారు. కాగా గడిచిన 24 గంటల్లో దిల్లీలో 1,534 కేసులు నమోదయ్యాయి. తొమ్మిది మంది కరోనాతో ప్రాణాలు వదిలారు. దీంతో ఇప్పటి వరకు దిల్లీలో నమోదైన కేసుల సంఖ్య 6.45,276కు చేరింది. ప్రస్తుతం 6,051 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 10,987కు చేరింది.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

దివ్యాంగ సంస్థ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి
కార్యకర్తలకు చెక్కులు పంపిణీ చేసిన మంత్రి

జనగామ,మార్చి27(ఆర్ఎన్ఎ): అర్హులైన దివ్యాంగులందరికీ ప్రభుత్వ లబ్ధి చేకూరేలా అన్ని చర్యలను సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం తీసుకున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగులకి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. జనగామ జిల్లా పాలకుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ, కరోనా కష్ట కాలంలోనూ అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా కొనసాగిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని, దేశంలో ఏకైక సీఎం కెసిఆర్ అని అన్నారు. కరోనా సమయంలో దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, బోద కాలు బాధితులు తదితరులకు ఇచ్చిన పెన్షన్లు వారికి ఎంతో ఊరట నిచ్చాయన్నారు. అదృష్టవశాత్తు సీఎం కేసిఆర్ ఆ శాఖను తనకే అప్పగించడం తన అదృష్టం అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 5లక్షల మంది దివ్యాంగులకు నెలకు రూ. 3016/- పెన్షన్స్ అంటే, ప్రతి నెలా రూ.150 కోట్లు, సంవత్సరానికి రూ.1800 కోట్లు ఒక్క ఆసరా పథకం ద్వారా దివ్యాంగుల కు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం, ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే అన్నారు. ముఖ్యమంత్రి మనసున్న మహారాజు అని, ఆయన అందరి సంక్షేమం కోరుకుంటున్నారని చెప్పారు. దివ్యాంగుల బాధలు చూసి వారికి ఇచ్చే పెన్షన్ మొత్తాన్ని 3,016కు పెంచిన ఘతన కూడా సీఎందే అన్నారు. అలాగే దివ్యాంగులకు ఇతరత్రా లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెం.1.గా ఉందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్, ఆ సంస్థ చైర్మన్ డా.కె.వాసుదేవ రెడ్డి పని చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమే, ఉద్యోగాలలో 4?, విద్య ఉపాధి లో 5? రిజర్వేషన్లు కల్పిస్తూ వికలాంగుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ సూచన మేరకు వికలాంగుల సహకార సంస్థ ద్వారా త్వరలో రూ. 20కోట్లతో రూపాయలతో 13వేయిల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరే విధంగా అనేక సహాయ ఉపకరణాలను త్వరలో ఉచితంగా అందించబోతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారులు, పాలకుర్తి నియోజకవర్గ దివ్యాంగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇదిలావుంటే కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, ఆ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సంబంధిత బాధితులకు పార్టీ కార్యకర్తలకిచ్చే ప్రమాద బీమా చెక్కులను ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పార్టీల మనుగడ పార్టీ కార్యకర్తల మీద ఆధార పడి ఉంటుందని, ఈ విషయం తెలిసిన సీఎం కెసిఆర్ పార్టీ కార్యకర్తలకు మిగతా ఏ పార్టీలకు లేని విధంగా భీమా సదుపాయం కల్పించారన్నారు. వారి ప్రీమియంని కూడా పార్టీ చెల్లించే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రి పాలకుర్తికి చెందిన గుండ్లే రాజు భార్య గుండ్లే సుజాత కు, దేవరుప్పుల మండలంలోని చిన్న మడురు గ్రామానికి చెందిన మొగుళ్ల సోమనర్సయ్య భార్య విజయమ్మకు రూ.2లక్షల చొప్పున చెక్కులు అందచేశారు.చెక్కులు పొందిన సుజాత, విజయమ్మలు సీఎం కెసిఆర్ కి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవరుప్పుల మండల టిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఇంటిముందు కాలువలో పాము పిల్లలు

ఆందోళనలో స్థానిక ప్రజలు

మెదక్,మార్చి27(ఆర్ఎన్ఎ): జిల్లాలో పాము పిల్లలు రోజుకొక ప్రాంతంలో కలకలం సృష్టిస్తున్నాయి. వారం క్రితం చినశంకరంపేట మండలం, సురారం గ్రామ శివారులోని పంట పొలంలో బండరాయి కింద 21 నాగుపాము పిల్లలు బయటపడ్డాయి. ఈ ఘటన మరువకముందే కొల్చారంలోని బొజ్జ వీరేశం అనే వ్యక్తి ఇంటి ముందున్న మురుగు కాలువలో పాము పిల్లలు ఒక్కోక్కటిగా బయటకు వచ్చాయి. 50కి పైగా పాము పిల్లలు కనిపించాయి. వాటిని చూడ్డానికి స్థానికులు గుంపులు గుంపులుగా చేరుకున్నారు. వరుసగా పాము పిల్లలు కనిపించడంతో ప్రజలు భయపడిపోతున్నారు.

తెలంగాణలో మళ్లీ విజృంభిస్తోన్న కరోనా

-హైదరాబాద్‌లో పెరుగుతున్న కేసుల సంఖ్య

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): గ్రేటర్‌లో కరోనా వైరస్ మరోసారి పంజా విసురుతోంది. గత 20 రోజులుగా వరుసగా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. సిటీలో ఆరు ప్రాంతాల్లో కరోనా కేసులు భయపెట్టిస్తున్నాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, హిమాయత్ నగర్, చింతల్ బస్తి, గోల్కొండ, ఆఫూపురా ప్రాంతాల్లో ఎక్కువగా కేసులు నమోదు అవుతున్నాయి. హాస్టల్స్, రద్దీ గల ప్రాంతాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. దీంతో బల్దియా ప్రధాన కార్యాలయంలో సందర్శకుల ఎంట్రీకి అనుమతి నిరాకరించారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా క్రియాశీల కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం 4,241 కొవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నాయి. పది రోజుల కిందట వీటి సంఖ్య 2,101గా ఉండేది. రాష్ట్రంలో శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 58,029 కరోనా నిర్ధరణ పరీక్షలు నిర్వహించగా.. 495 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 3,05,804కి చేరింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ శనివారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. నిన్న కొవిడ్‌తో ఇద్దరు మృతిచెందారు. దీంతో ఇప్పటి వరకు మృతిచెందిన వారి సంఖ్య 1685కి చేరింది. కరోనా బారి నుంచి నిన్న 247 మంది కోలుకున్నారు. ఇప్పటి వరకు కోలుకున్న వారి సంఖ్య 2,99,878కి చేరింది. 3,684 యాక్టివ్ కేసుల్లో 1,616 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా 142 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా పరీక్షల సంఖ్య 99,61,154కి చేరింది.

సాగర్ ఉప ఎన్నిక అభ్యర్థిత్వంపై బండి కసరత్తు

-పలువురు నేతలతో మంతనాలు

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రాజకీయం మరోసారి వేడెక్కింది. నాగార్జునసాగర్ ఉప ఎన్నిక పార్టీల మధ్య కాక రేపుతోంది. ఇప్పటికే తమ అభ్యర్థిగా కాంగ్రెస్ జానారెడ్డిని ప్రకటించింది. అయితే టీఆర్ఎస్, బీజేపీ మాత్రం అభ్యర్థులను ప్రకటించలేదు. అభ్యర్థుల ఎంపికపై టీఆర్ఎస్, బీజేపీ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకెళుతున్నాయి. బీజేపీ అభ్యర్థిని ప్రకటించాకే ప్రకటన చేయాలని టీఆర్ఎస్ భావిస్తోంది. అటు టీఆర్ఎస్ ప్రకటన కోసం బీజేపీ ఎదురుచూస్తోంది. అయితే ఆశావహులు ఎక్కువగా ఉండడంతో బండి సంజయ్ సీనియర్లతో చర్చలు జరిపారు. అలాగే ఆశావహులతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి రేసులో అంజయ్య యాదవ్, నివేదితా రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, రవి నాయక్ ఉన్నారు. ఆదివారం నాటికి బీజేపీ అభ్యర్థి ఎవరన్నది క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. టీఆర్ఎస్ కూడా ఇవాళో, రేపో తమ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



శ్రీ "ఉప్పల ధడియం"కులజున
నప్పుడి పాత్రుల ధరించు "నాగయ్య"ను-నే
నాన్నగ మదిలో మలచుచు
నాన్నల చెప్పగ నుతించు నుద్భుత శీలున్!!

(మార్చి 28 అలనాటి హీరో చిత

ఫీల్‌గుడ్ వ్యవహారం సరికాదు !

నేటినిజం
ఆదివారం 28-3-2021

తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ..దేశంలో ముందువరుసలో ఉన్నదని ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఫీల్‌గుడ్ వ్యవహారంలో సిఎం కెసిఆర్ ఉన్నారు.

వ్యవసాయరంగం బేషుగ్గా ఉంది..కరెంట్ నిరంతరాయంగా వస్తోంది..ప్రాజెక్టుల్లో నీళ్లు పారుతున్నాయి. చెరువులు,కుంటలు నిండాయి. పాడిరైతులు ఆనందంగా ఉన్నారు. మత్స్యకారులు సంబరంగా ఉన్నారు. సంక్షేమపథకాలు జోరుగా సాగుతున్నాయి. ఇలా అన్ని రంగాల్లో అంతా మంచిగా ఉంటే ప్రజల్లో ఆందోళన ఉండాల్సిన అవసరం లేదు. అంతామంచిగా ఉంటే నిరుద్యోగుల ఆందోళనలు ఎందుకో తెలియడం లేదు. అయితే ప్రధానంగా వేధిస్తున్న సమస్యలను పట్టించుకోవడంలో పాలకులు విఫలం అవుతున్నారు. ఉద్యోగాలంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా..ఉపాధి చూపే ఉద్యోగావకాశాలను ప్రభుత్వాలు కల్పించాలి. వనరులను వినియోగించు కోవడం ద్వారా యువతో ఉన్న నైరాశ్యాన్ని పారద్రోలాలి. వారికి ఉపాధి మార్గాలను అన్వేషించాలి. కానీ అంతా మంచిగానే ఉన్నా విపక్షాలే మాట్లాడలేక పోయారని, నిర్మాణాత్మక సూచనలు ఇవ్వలేకపోయారని సిఎం చెప్పి విపక్షాల ప్రసంగాలను తక్కువగా చేసి చూపారు. వారు సమస్యలను ప్రస్తావిస్తుంటే ప్రోత్సమించకుండా మైక కట్ చేయడం ప్రత్యక్ష ప్రసారం చూస్తున్న వారికి చక్కగా కనిపి స్తోంది. ఇకపోతే ఉద్యోగావకాశాలు రాక గతంలో ఓ నిరుద్యోగి రవీంద్రభారతి చెంతనే ఆత్మహత్యకు యత్నించి కాల్చుకుని చనిపోయాడు. రెండ్రోజుల క్రితం ఎల్బీ నగర్‌లోఓ నిరుద్యోగి విషం తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇవన్నీ చిన్న సమస్యలుగా చూడరాదు. ఇలాంటి ఆత్మహత్యలతోనే మనం తెలంగాణ సాధించుకున్నాం. తెలంగాణ ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చిన సిఎం కెసిఆర్ ఆ మేరకు తన ప్రయత్నాలను మరింత వేగంగా అమలు చేయాలి. అంతామంచిగా ఉందన్న భ్రమలతో ప్రజను మభ్యపెట్టరాదు. అప్పులను సమర్థించుకోవడం..తాను చేసే పనులే కరెక్ట్ అన్న ధోరణి కూడా సరికాదు. కరోనా సమయంలోనూ సంక్షేమాన్ని అపలేదని చెప్పారు. ఈ విషయంలో ఎవరూ తప్పు పట్టడం లేదు. ఎన్ని అవరోధాలు వచ్చినా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి అనేది ఉపాధికి ఊతంగా పదికాలాల పాటు నిలిచేలా ఉండాలి. అసెంబ్లీలో చెప్పిన లెక్కలను ఎవరూ తప్పుపట్టడం లేదు. కానీ ప్రతిపక్షాలు నిర్మాణాతమక సూచనలు ఇవ్వలేదని చెప్పడంతో వారు ప్రస్తావించిన సమస్యలను పక్కన పడేశారు. అంతెందుకు తన నియోజకవర్గం గజ్వెల్ పరిధిలో నిర్వాసితులు పోరాడుతున్నారు. వారికి సరైన పునరావస ప్యాకేజీలు అందలేదు. తెచ్చిన ప్రయత్నాలు ఏ మేరకు ఉన్నయో తెలుస్తుంది. ఈరాష్ట్రంలో అప్పులు పెరగలేదు. అప్పులు తీసుకొనే రాష్ట్రాల్లో మనం బాటమ్ నుంచి 25 ప్లేస్‌లో ఉన్నం. అతి తక్కువ అప్పులు చేసి, పటిష్టమైన ఆర్థిక వ్యూహం, క్రమశిక్షణను పాటించిన రెండు మూడు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. తీసుకున్న అప్పును ఎలా వాడుకోవాలో కూడా మనకే తెలుసని అన్నారు. అయితే చేసే అప్పులు ఆస్తులను కూడబెట్టేవిగా ఉంటే మంచిదే. అవి ఉపాధికి ఆధారం కావాలి. రాబోయే ఆరేడు నెలల్లో అన్ని మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు కడతామని చేసిన ప్రకటన కూడా మంచిదే. మొత్తంగా తెలంగాణ అభివృద్ధిలో ముందున్నదని,ఆర్థిక స్థితికి ఎలాంటి ఢోకా లేదని సిఎం కెసిఆర్ అసెంబ్లీలో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తీసుకోవడమే కాదు తిరిగి చెల్లిస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. తాము అభివృద్ధిని

దృష్టిలో పెట్టుకుని అప్పులు చేసినా వాటిని తీర్చే పద్ధతి కూడా అవలంబిస్తున్నామని అన్నారు. అయితే రాష్ట్రంలో క్రమంగా అప్పులు పెరిగిపోతున్నాయని తెలిపారు. 60 ఏళ్లలో చేసిన అప్పులకంటే ఈ అప్పుల్లో నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీలు అందించే సంకల్పం చేసి ఉంటే ఆందోళనలను దూరం చేయవచ్చు. కేవలం పోలీసులు, అధికారుల నివేదికలే కాకుండా సొంతంగా నివేదికలు తెప్పించుకుని చూస్తే సిఎం కెసిఆర్ చేస్తున్న నాలుగేళ్లలో చేసిన అప్పులే ఎక్కువని విపక్షాల నేతలు ఆరోపించారు. ఈ స్థాయిలో అప్పులు చేస్తే రాష్ట్రానికి మంచిదికాదని హెచ్చరించారు. జీఎస్‌డీపీ వృద్ధిరేటును ఎక్కువ చేసి చూపుతున్నారు.

వృద్ధిరేటును ఎక్కువచేసి చూపడం ద్వారా రుణ పరిమితిని పెంచుకోవాలనుకుంటున్నారని అన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి మూడేళ్లలో పడిపోయిందని అన్నారు. మద్దతు ధర పెంచాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిందని తెలిపారు. కేంద్రం ఇచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు చేరలేదన్నారు. కేంద్రం ఇచ్చే మద్దతు ధరతో పాటు తెలంగాణ ప్రభుత్వం బోనస్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. కర్ణాటక సర్కార్ పంటలన్నింటికీ బోనస్ ఇస్తోందన్నారు. తెలంగాణలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ధర పడిపోవడం వల్ల మిర్చి రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్రంలో క్రమంగా అప్పులు పెరిగి పోతున్నాయని.. ఈ ఆరేళ్లలోనే రెట్టింపు అప్పులు పెరిగాయన్నది విపక్షాల ప్రధాన అరోపణగా ఉంది. అయితే అప్పులు తేర్చుకునే మార్గం చూడాలి. అప్పులు కూడా అతిగా పెరగడం ప్రజలపై భారం పడగలదు. సంక్షేమ పథకాలు కూడా మోతదాఉ మించకుండా చూసుకోవాలి. అప్పులతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకొని పోకుండా ఆదాయం పెంచే మార్గాలను అన్వేశించాలి. ఇకపోతే కేంద్రం హక్కులను హరిస్తోందన్న సిఎం కెసిఆర్ అందుకు తగ్గట్లుగా పోరాటాలు చేయాలి. కేంద్రాన్ని నిలదీయాలి. కాకమ్మ కబుర్లు చెబుతున్న బిజెపిని ఎండగట్టాలి. అన్ని రాష్ట్రాల్లో ఇదే వైకరి ఉంది. కాబట్టి అంతా కలసి ఉమ్మడి పోరాటం చేయాలి. అప్పుడే రాష్ట్రాలు మనగలుగుతాయి.

30రోజుల బడ్జెట్‌ను ఆరు రోజుల్లో ముగించారు

పక్క రాష్ట్రం నీళ్ల దోపిడీకి పాల్పడుతున్నా పట్టిలేదు
ప్రతిపక్ష నాయకులకు మాట్లాడే అవకాశం ఏదీ
ప్రభుత్వ తీరు, కెసిఆర్‌పై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): 30 రోజులు నడవాల్సిన బడ్జెట్ సమావేశాలు 6 రోజులే నడిపారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తప్పుబట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ పక్క రాష్ట్రం నీటి దోపిడికి పాల్పడుతున్నా సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర సొమ్మును కాంట్రాక్టులకు దోచి పెడుతున్నారుని దుయ్యబట్టారు. 2020-21 ఏడాదికి సంబంధించిన 2 లక్షల 30 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన భారీ బ్జడెట్‌ను కేవలం ఆరు రోజులకు మాత్రమే చర్చలను పరిమితం చేసి.. పాస్ చేయించుకుని వెళ్లిన వైనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. శుక్రవారం.. శాసనసభా సమావేశాలు ముగిసిన అనంతరం గన్ పార్క్‌లో దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వంపైనా, సీఎం కేసీఆర్ పైనా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దాదాపు 30 రోజులు జరపవలసిన బడ్జెట్ సమావేశాలను ఆరు రోజులకే పరిమితం చేయడంపై ఆయన మండిపడ్డారు. భారీ బడ్జెట్ పైనా సుదీర్ఘంగా చర్చలు జరిపి.. పాస్ చేసుకోవాల్సి ఉండగా, కేవలం ఆరు రోజుల్లోనే సమావేశాలు పూర్తి చేయడంపై భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఆరు రోజుల్లో కూడా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని భట్టి విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచనలను అధికార పక్షం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. బడ్జెట్ ను అధికార పక్షం పాస్ చేయించుకున్న వైనం.. ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. కేసీఆర్ పాలన నియంతృత్వ పాలనలా ఉంది తప్ప ప్రజాస్వామ్య పాలనలా లేదన్నారు, శాసనసభా సమావేశాలు కేవలం అలంకార ప్రాయంగా మారిపోయాయి తప్ప... అర్థవంతమైన చర్చలు జరగడం లేదని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ రంగం, నీటిపారుదల, కృష్ణానదిమీద ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టుల గురించి సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని భట్టి చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రీ డిజైన్ పేరుతో టెండర్లలో అక్రమాలకు పాల్పడి.. భారీ అవినీతికి పాల్పడినట్లు భట్టి ఆరోపించారు. ఇది రాష్ట్రం మీద అదనపు ఆర్థిక భారంలా మారిందని బట్టి అన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ ప్రజల సమక్షంలో పెట్టడంతో పాటు చట్టసభలలో పెట్టాలని భట్టి డిమాండ్ చేశారు. డీపీఆర్‌లను చట్టసభల్లో ఇవ్వకపోవడంతో ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అనేక అవకతవకలు జరిగినట్లు అనుమానాలున్నాయన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఈ రాష్ట్ర ప్రభుత్వం నడవడం లేదన్నారు. అప్పులను ప్రభుత్వం విపరీతంగా చేస్తోందన్నారు. ఈ ఏడాది రూ. 48 వేల నుంచి రూ. 50 వేల కోట్ల వరకూ అప్పులు ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా.. చిరవకు రాష్ట్రాన్ని డెడ్ ట్రాప్ లోకి నెట్టేస్తున్నారన్నారు. 2023 నాటికల్లా అప్పులు ఐదున్నర నుంచి 6 లక్షల కోట్ల రూపాయాలకు రాష్ట్ర అప్పులు చేరుకుంటాయని వివరించారు. రాష్ట్రాన్ని కుదవపెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఇది చాలా ప్రమాదకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన నిధులను వినియోగించకుండా.. వాటిని ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయితీ కార్యదర్శుల అంశాలపై కాంగ్రెస్ శాసనసభా పక్షం.. సభలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం నేరుగా సమాధానం ఇవ్వలేదని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలు.. భజన మండలిగా నడిచిందని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆక్షేపించారు. సభలో అధికార పార్టీ చెప్పిందే వినేలా నడిపారని, ఆర్టీఎస్, సంగమేశ్వర ప్రాజెక్టులపై ప్రశ్నిస్తే సమాధానం లేదని శ్రీధర్‌బాబు చెప్పారు. సర్పంచ్‌లకు నిధులు ఇవ్వకుండా వేధిస్తున్నారని, భూనిర్వాసితులను పోలీసులతో వేధిస్తున్నారని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు.

దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై వివక్ష

-సిఎం కెసిఆర్ తీరుపై మండిపడ్డ సంపత్

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): దక్షిణ తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్ వివక్ష చూపిస్తున్నా రంటూ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సీఎం కేసీఆర్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఆర్టీఎస్‌పై ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మాణాలు చేస్తుంటే, అడ్డుకోవాల్సిన కేసీఆర్ ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. కేసీఆర్ దృష్టి ఎప్పటికైనా.. ఓట్లు,..సీట్లపైనే ఉంటుందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర నీటి వాటాలను దోచుకుంటుంటే జిల్లా మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ఏమీ చేయలేని దద్దమ్మలుగా ఉన్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వంతో కేసీఆర్ చీకటి ఒప్పందం కుదుర్చుకుంటున్నారని, కేసీఆర్‌కు తెలియకుండా ఏపీ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు చేస్తుందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం చేపట్టిన అక్రమ ప్రాజెక్టులను కేసీఆర్ అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్న సమయంలో మీడియాను రోడ్డు పైకి నెట్టడం దౌర్భాగ్యమని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా మీడియాపై ఇలాంటి ఆక్షలు లేవని సంపత్ కుమార్ ఆరోపించారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని లేకుంటే కాంగ్రెస్ పోరాడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదేపదే ఒకటే విషయం మాట్లాడితే ఎలా: స్పీకర్

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ నాయకులపై స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఫైర్ అయ్యారు. పద్దులపై చర్చ జరిగిన తరువాత కూడా కాంగ్రెస్ నేతలు మళ్ళీ అదే మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ నేతలకు కావాల్సిన సమయం ఇచ్చినా ఆరోపణలు చేస్తున్నారు. భట్టి విక్రమార్క సీనియర్ సభ్యులు అయి ఉండి కూడా సభ రూల్స్ పాటించడం లేదు. సభ్యుల సంఖ్య ప్రకారం సమయాన్ని కేటాయిస్తారు. ఇష్టం వచ్చినంత సమయం మాట్లాడతామంటే కుదరదు' అని ఆయన మండిపడ్డారు.

ఇప్పపూవు సేకరణకు వెళ్లిన గిరిజనులపై దాడి

-అటవీ అధికారుల తీరుపై మండిపడుతున్న జనం

నాగర్‌కర్నూల్,మార్చి27(ఆర్ఎన్ఎ): గిరిజనులపట్ల అటవీశాఖ అధికారులు దురుసుగా ప్రవర్తించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. అమ్రబాద్ మండలం, మన్ననూర్‌లోని సమీప అడవిలోకి ఇప్పపువ్వు సేకరణకు 25 మంది లంబాడ గిరిజనులు వెళ్లారు. చీకటి పడడంతో వారు అడవిలోనే నిద్రించారు. దీంతో అర్ధరాత్రి 12 మంది అటవీ ఉద్యోగులు అక్కడకు వెళ్లి లంబాడ గిరిజనులపై దాడి చేశారు. వారిని మన్ననూర్ ఫారెస్ట్ బేస్ క్యాంప్ కార్యాలయంలో బంధించారు. ఫారెస్టు అధికారుల దాడిలో గిరిజన మహిళలు, పురుషులకు గాయాలు అయ్యాయి. వారిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమకేమి తెలియదని, ఇప్పపువ్వు సేకరణకు ఇక్కడకు వచ్చామని, రాత్రి కావడంతో ఇక్కడే నిద్రించామని చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోలేదని గిరిజనలు వాపోయారు. ఈ ఘటనపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గిరిజనులు మన్ననూర్ చెక్‌పోస్టు ప్రాంతంలో రాస్తారోకో చేపట్టారు.

మార్క్‌ఫెడ్ ఆలస్యంతో నష్టపోయిన శనగ రైతులు

వచ్చిన ధరలకు అమ్ముకున్న అన్నదాతలు

నిజామాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): మార్క్‌ఫెడ్ ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో శనగ రైతులు ముందే అమ్మకాలను యడంతో భారీగా నష్టపోయారు. వ్యాపారులు తాము నిర్ణయించిన ధరలకు కొని రైతులకు గిట్టుబాటు ధరలు దక్కకుండా చేశారు. గత నెలలోనే పంట చేతికి రావడంతో ఎక్కువ మంది రైతులు క్వింటాలు రూ.4వేల నుంచి రూ.4,700 ల మధ్య అమ్మకాలు చేశారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాలు రాకముందే అమ్మకాలు చేశారు. తమ వద్దకు వచ్చిన వ్యాపారులకు ఎక్కువ మంది శనగలను అమ్మారు. కేంద్రాల ఏర్పాటుకు కేం ద్రం నుంచి అనుమతి రాకపోవడం, ప్రభుత్వం కొనుగోలుకు ప్రకటన చేయకపోవడం వల్ల ఈ అమ్మకాలు జరిగాయి. మహారాష్ట్రతో పాటు జిల్లాకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగో చేయడంతో శనగ అమ్మకాలు జరగడంతో రైతులకు ఆశించన ధరలు దక్కలేదు. కొంతమంది రైతులకు మద్దతు ధర వరకు కూడా కొనుగోలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ప్రస్తుతం రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఈ రెండు కేంద్రాలకే కాకుండా మార్కెట్‌యార్డులకు తీసుకువచ్చిన శనగలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇతర మార్కెట్‌లో కూడా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో 26వేల 413 ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. బోధన్, కోటగిరి, రెంజల్‌తో పాటు ఇతర మండలాల్లో పంటను వేశారు. గత నెలలోనే శనగ పంట మార్కెట్‌కు వచ్చినా..

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం కొద్ది రోజుల క్రిత మే అనుమతి ఇవ్వడంతో ప్రస్తుతం ఈ కొనుగోళ్లను మొదలుపెట్టారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బోధన్, కోటగిరి మండలకేంద్రాల్లో ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌తో పాటు ఇతర మార్కెట్‌లలో కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాలుకు రూ.5,100లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ కు ఆదేశాలు ఇవ్వడంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముందే అమ్మకాలు చేసిన పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఇక మరింత పటిష్టంగా ప్యారిస్ ఒప్పందం

పర్యావరణ సదస్సుకు భారత్ సహా 40దేశాలకు ఆహ్వానం

వాషింగ్టన్,మార్చి27(ఆర్ఎన్ఎ): పారిస్ ఒప్పందాన్ని ముందుకు తీసుకుని వెళ్లాలని అమెరికా పట్టుదలగా ఉంది. ట్రంప్ చేసిన తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని బైడెన్ నిర్ణయించారు. ఇందులో బాగంగా 'పర్యావరణ సదస్సు'కు భారత ప్రధాని మోడీతో పాటు 40 దేశాల ప్రతినిధులను అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆహ్వానించారు. పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, ఆవశ్యకత, ఆర్థిక ప్రయోజనాలు తదితర అంశాలపై ఏప్రిల్ 22, 23 తేదీల్లో వర్చువల్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోడీతో పాటు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, జపాన్ ప్రధాని యోషిహైడ్ సుగా, బ్రెజిల్ అధ్యక్షుడు బల్సెనారో, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, సౌదీ అరేబియా రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజిజ్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌లను ఈ సదస్సుకు ఆహ్వానించారు. అలాగే దక్షిణాసియా దేశాలకు చెందిన ఇద్దరు నేతలు.. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, భూటాన్ ప్రధాని లోటే థెరింగ్‌లను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించారు. నవంబర్‌లో గ్లాస్గోలో జరగనున్న ఐక్యరాజ్యసమితి పర్యావరణ మార్పుల సమావేశం (సిఒపి -26)కి ముందు ఈ సదస్సు కీలకం కానుందని వైట్‌హౌస్ ప్రకటించింది. పారిస్ ఒప్పందంలో అమెరికా తిరిగి చేరనున్న నేపథ్యంలో.. పర్యావరణ మార్పులకు వ్యతిరేకంగా తీసుకోనున్న కీలక చర్యల్లో బైడెన్ ముద్ర కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సదస్సు, సిఒపి 26 రెండింటి లక్ష్యం భూమి వేడెక్కడాన్ని 1.5 డిగ్రీలకు పరిమితం చేసేవిధంగా చర్యలు చేపట్టడమేనని ఐక్యరాజ్యసమితి పర్యావరణ మార్పుల వైట్‌హౌస్ పేర్కొంది. బైడెన్ ప్రచారంలో భాగమైన మెరుగైన వేతన ఉద్యోగాలను సృష్టించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లడం, పర్యావరణ చర్యలను అనుసంధానిస్తూ.. బలహీన దేశాలకు సహకారం అందించడంలో ఈ సదస్సు కీలకం కానుందని వైట్‌హౌస్ పేర్కొంది. సమావేశ సమయానికి పారిస్ ఒప్పందం ప్రకారం.. అమెరికా 2030 ఉద్గారాల లక్ష్యాన్ని ప్రకటించనుందని వైట్‌హౌస్ తెలిపింది. ఈ సమావేశాలను తమ దేశాలు కూడా బలమైన పర్యావరణ లక్ష్యాలను చేరుకునేందుకు ఎలా దోహదపడతాయో తెలిపేందుకు ఒక అవకాశంగా వినియోగించుకోవాలని బైడెన్ ఆ ఆహ్వానంలో పేర్కొన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీలో కరోనా కలకలం

ఐసోలేషన్‌లో హాస్టల్ విద్యార్థులు
ఆ ప్రాంతాన్ని కంటైన్‌జోన్‌గా ప్రకటించిన అధికారులు
కరోనా కేసులపై ఆరా తీసిన మంత్రి ఆళ్లనాని
అప్రమత్తంగా ఉండాలని అదికారులకు హెచ్చరిక

విశాఖపట్నం,మార్చి27(ఆర్ఎన్ఎ): విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో కరోనా కలకలం సృష్టించింది. ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఒకే రోజు 58 మంది విద్యార్థులు పాజిటివ్‌గా పరీక్షించారు. క్యాంపస్‌లో మొత్తం 800 మంది విద్యార్థులకు కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా..ఈ కేసులు బయటపడ్డాయి. మరో 400 మంది విద్యార్థులకు సంబంధించి ఫలితాలు రావాల్సి ఉంది. అయితే, కేసులు మరింత పెరిగే అవకాశం ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ యంత్రాంగం పేర్కొంది. హాస్టల్ విద్యార్థులను ఐసోలేషన్‌లో ఉంచారు. బ్లాక్-1, బ్లాక్-2-, బ్లాక్-3లో మరికొంత మంది విద్యార్థులకు వైద్యసేవలందిస్తున్నారు. కరోనా కేసుల నమోదుతో ఆ ప్రాంతాన్ని కంటైన్‌జోన్‌గా ప్రకటించారు. అప్రమత్తమైన అధికారులు యూనివర్సిటీలు అధికారులు శానిటేషన్ చేపట్టారు. అయితే విజయవాడ నుంచి వచ్చిన ఓ విద్యార్థికి మొదట వైరస్ పాజిటివ్‌గా గుర్తించారు. అతని ద్వారా మిగతా వారికి వ్యాపించి ఉంటుందని గుర్తించినట్లు తెలుస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలలో డే స్కాలర్‌తో కలిపి 5వేల వరకు ఉంటారని యూనివర్సిటీ అధికార వర్గాలు తెలిపాయి. హాస్టల్‌లో 800 మంది విద్యార్థులుండగా వారందరికీ టెస్టులు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరికీ లక్షణాలు కనిపించలేదని తెలిపారు. వైరస్ ఇతరులకు సోకకుండా కంటైన్‌జోన్ ప్రకటించి, బ్లాక్ ఖాళీ చేయించినట్లు చెప్పారు. హాస్టల్ గదులను క్వారంటైన్, ఐసోలేషన్‌కు వినియోగిస్తున్నట్లు చెప్పారు. భయపడాల్సిన అవసరం ఏమీ లేదని, అన్ని వైద్యసేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.త్వరలోనే మహిళా హాస్టల్‌లో పరీక్షలు చేయించాల్సి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 6వ తేదీ వరకు ఇంజినీరింగ్ పరీక్షలు జరుగాల్సి ఉంది. పరీక్షల కోసమే విద్యార్థులు హాస్టల్‌కు వచ్చారు. విద్యార్థులు వైరస్ బారినపడడంతో యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం జరగాల్సిన పరీక్షలన్ని వాయిదా వేసింది. మళ్లీ ఎప్పుడు పరీక్షలు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. ఇకపై అన్ని తరగతులకు ఆన్‌లైన్ బోధన చేపట్టాలని ఆదేశించింది. ఇదిలావుంటే ఆంధ్ర యూనివర్సిటీలో కరోనా కలకలంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని ఆరా తీశారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న 65 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. జిల్లా డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణతో మంత్రి ఆళ్ల నాని ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయూ ఇంజనీరింగ్ క్యాంపస్‌లో 1500 వందల మందికి కరోనా పరీక్షలు చేయగా 65మందికి కరోనా నిర్ధారణ అయ్యింది. ప్రతి రోజు 7వేల 5వందలు వరకు కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నా మని మంత్రి ఆళ్ల నాని తెలిపారు. జిల్లాలో ఆరు కోవిడ్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. కేజీహెచ్ హాస్పిటల్, అనకాపల్లి, విమ్స్ నర్సీపట్నం, పాడేరు, అరకు హాస్పిటల్స్ కరోనా బాధితుల కోసం 1000 బెడ్స్ సిద్ధం చేశామని తెలిపారు. కరోనా సోకిన బాధితులు ప్రస్తుతం కేజీహెచ్ హాస్పిటల్‌లో 15మందికి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేశామని మంత్రి ఆళ్లనాని వెల్లడించారు.

గోరుముద్దకు నిధులు నిలిపివేస్తే ఎలా

మద్యనిషేధం అంటూనే మహిళల పుస్తెలకు కూడా ఎసరు
ట్విట్టర్ వేదికగా మండిపడ్డ టిడిపి నేతలు

అమరావతి,మార్చి27(ఆర్ఎన్ఎ): గోరుముద్దకు బిల్లుల చెల్లింపును నిలిపివేయడంపై టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ...'గోరుముద్దకు బిల్లుల చెల్లింపు ఆపేసిన ప్రభుత్వం, వర్గరకు జీతాలూ లేవు. ప్రచార ఆర్భాటాలు తప్ప పథకాల అమలులో చిత్తశుద్ధి శూన్యం. పేద విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి బిల్లులు చెల్లించడానికి లేని డబ్బులు, వందలకోట్ల ప్రజాధనంతో సొంత మీడియా సంస్థలకు ప్రకటనలు ఇచ్చేందుకు మాత్రం ఎక్కడివని అంటూ దేవినేని ఉమ ట్వీట్ చేశారు. ఇదిలావుంటే మద్యపాన నిషేధం అంటూనే జగన్ రెడ్డి మహిళల మెడలో పుస్తెలు కూడా లాగేస్తున్నారని టీడీపీ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ట్విట్టర్ వేదికగా తీవ్రస్థాయి

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు

-స్వచ్ఛమైన నీటినే ప్రజలకు అందించాలి: కలెక్టర్

గుంటూరు,మార్చి27(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తుండాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆదేశించారు. మల్టీ పారామీటర్ వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్టు కిట్లను పంపిణీ చేశారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 1,016 గ్రామాలకు ఈ కిట్లు వచ్చాయన్నారు. కిట్ల ద్వారా ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షించి ఫలితాలను సంబంధిత శాఖకి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిర్దేశిరచిన లక్ష్యాలు అధిగమించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు సంబంధించి సమ్మర్ యాక్షన్ ఎ÷-లాన్ అమలుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ఏర్పాటు చేసి ఇతర శాఖల అధికారులను అందులో పర్యవేక్షణకు నియమించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడకుండా జిల్లా విపత్తుల నిర్వహణ విభాగం ఎండ తీవ్రతపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకొన్న రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. ఇళ్ల స్థలాల దరఖాస్తులను వెంటనే పరిష్కరించి అర్హత ఉన్న వారికి ప్లాట్లు కేటాయించాలన్నారు. జగనన్న తోడు కింద పాడి పరిశ్రమల యూనిట్‌లు ఏర్పాటు చేయించాలన్నారు.

కరోనాతో హోళీ వేడుకలకు దూరం: గవర్నర్

విజయవాడ,మార్చి27(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 28, 29 హోలీ పండుగను రాష్ట్రంలో నిర్వహించకూడదని రాజ్ భవన్‌లో గవర్నర్ బిస్వాభూషణ్ హరిచందన్ ప్రకటించారు. కరోనా కేసులు పెరుగుతుండటం వల్ల హోళీ పండుగను ఇంట్లోనే ఉండి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పండుగ జరుపుకోవాలని గవర్నర్ సూచించారు. అర్హులైన అందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సూచించారు.

గోవిందరాజస్వామి ఆలయంలో చోరీకి యత్నం

తిరుపతి,మార్చి27(ఆర్ఎన్ఎ): గోవిందరాజ స్వామి ఆలయంలో చోరీకి విఫలయత్నం జరిగింది. శుక్రవారం రాత్రి ఏకాంత సేవ తర్వాత ఆలయంలోకి ఆగంతకుడు ప్రవేశించినట్టు అధికారులు గుర్తించారు. రాత్రి 9 గంటలకు ఆలయాన్ని మూసివేసి ఉదయం సుప్రభాతం సేవ కోసం అర్చకులు ఆలయాన్ని తెరిచారు. అలయంలోని హుండీతో పాటు చిందరవందరగా పడి ఉన్న సామగ్రిని గుర్తించారు. చోరీ జరిగిందన్న అనుమానంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు

కరోనా కేసులున్న విద్యాసంస్థలు మూసేయాలి

-అధికారులను ఆదేశించిన మంత్రి సురేశ్

అమరావతి,మార్చి27(ఆర్ఎన్ఎ): కరోనా కేసులు నమోదైన విద్యాసంస్థలను వెంటనే మూసివేయాలని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో కరోనా స్థితిగతులపై విద్యాశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో పూర్తి స్థాయిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రణాళికతో చర్యలు తీసుకోవడంతో అకడమిక్ క్యాలెండర్ గాడిలో పెట్టామని చెప్పారు. పెద్ద ఎత్తున కరోనా సంక్షోభం వస్తే కొంత నష్టం తప్పక ఉంటుందని, దేశంలోనే అత్యధిక కరోనా టెస్టులు మన రాష్ట్రంలోనే చేశామని పేర్కొన్నారు. కరోనా మళ్లీ పుంజుకుంటోందని, రెండు నెలలు జాగ్రత్త అవసరమని తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు కళాశాలలో 168 మందికి కరోనా సోకిందని, కరోనా సోకినవారిని ప్రాథమికంగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు కరోనా పరీక్షలు ఇంకా పెంచుతామని, ఆదివారాలు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు.

కలెక్టరేట్ కార్యాలయంలో కరోనా కలకలం

- టెస్టుల్లో 18 మందికి కరోనా సోకినట్లు నిర్ధారణ

కడప,మార్చి27(ఆర్ఎన్ఎ): కలెక్టరేట్ కార్యాలయంలో కరోనా కలకలం రేగింది. కలెక్టరేట్ లోని డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న 60 మంది ఉద్యోగులకు కరోనా టెస్టులు నిర్వహించారు. ఈ టెస్టుల్లో 18 మందికి కరోనా సోకినట్లు నిర్ధారణ జరిగింది. 18మందికి కరోనా సోకడంతో కలెక్టరేట్ అధికారులు అప్రమత్తం అయ్యారు. పాజిటివ్‌గా నిర్ధారణ జరిగిన ఉద్యోగులు హోమ్ క్వారంటైన్‌లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన డ్వామా కార్యాలయం సిబ్బందిని కూడా హోమ్ క్వారంటైన్ లో ఉంచారు. ఇంటి నుంచే విధులు నిర్వహించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలావుంటే కొవిడ్‌ను నియంత్రించడానికి ప్రతిఒక్కరూ టీకాను వేయించుకోవాలని, కరోనా కట్టడి టీకాతోనే సాధ్యమని డీఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కు మార్ పేర్కొన్నారు. జిల్లాలో 10,196 మంది టీకా మందు వేసుకున్నారని, దీంతో ఇప్పటి వరకు మొత్తం 1,49,457 మంది వ్యాక్సినేషన్ వేసుకున్నట్లు ప్రకటనలో ఆయన తెలిపారు.

వేంకటేశ్వర ఆలయంలో చోరీ

తిరుపతి,మార్చి27(ఆర్ఎన్ఎ): మంగళం బాలకృష్ణాపురం వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. దొంగలు ఆలయంలోని రెండు హుండీలు వెండి వస్తువులను దొంగిలించారు. శటారీ, తీర్థము చంబు, చెంచాలను దొంగిలించారు. కాగా.. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో సైతం చోరీకి విఫలయత్నం జరిగింది. శుక్రవారం రాత్రి ఏకాంత సేవ తర్వాత ఆలయంలోకి ఆగంతకుడు ప్రవేశించినట్టు అధికారులు గుర్తించారు. రాత్రి 9 గంటలకు ఆలయాన్ని మూసివేసి ఉదయం సుప్రభాతం సేవ కోసం అర్చకులు ఆలయాన్ని తెరిచారు. అలయంలోని హుండీతో పాటు చిందరవందరగా పడి ఉన్న సామగ్రిని గుర్తించారు. చోరీ జరిగిందన్న అనుమానంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ప్రహసనంగా ఇంటింటికీ రేషన్

-సకాలంలో అందక అబ్దిదారుల ఆందోళన

శ్రీకాకుళం,మార్చి27(ఆర్ఎన్ఎ): జగన్ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటికి రేషన్ పంపిణీ అప్రతిష్ట పాలవుతోంది. ఇంటింటికి రేషన్ కాస్త రోడ్డు రేషన్‌గా మారింది. సాంకేతిక సమస్యలు కూడా శాపంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభించింది. కానీ ఆది ఆచరణలో మాత్రం ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. శ్రీకాకుళం జిల్లాలో ఇంటింటికి రేషన్ పంపిణీ వాహనాల నిర్వహణ తీరుతో ప్రజలు విసిగిపోతున్నారు. అధికారులు చెబుతున్నట్లు ఇంటింటికి రేషన్ సరుకులు ఇవ్వడంలేదు. వాహనం రోడ్డుపైనే ఉంచి కార్డు దారులు వచ్చి బియ్యం, సరుకులు తీసుకువెళ్లాలని చెబుతున్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తంలో ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం వాలంటీర్లద్వారా నిర్వహించేవారు. వాలంటీర్లే కార్డు దారుల ఇంటికి వచ్చి రేషన్ పంపిణీ చేసేవారు. కానీ రేషన్ పంపిణీ వాహనాలు వచ్చిన తర్వాత సరుకుల కోసం పనులు మానుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సాంకేతిక పరమైన సమస్యల కారణంగా సకాలంలో రేషన్ అందడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో భారీగా ఎర్రచందనం దుంగల పట్టివేత

కడప,మార్చి27(ఆర్ఎన్ఎ): జిల్లాలో భారీగా అక్రమ ఎర్రచందనం దుంగలను పట్టుకున్నామని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. శనివారం ఎస్పీ అన్బురాజన్ మీడియాతో మాట్లాడుతూ..అక్రమ ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశామని చెప్పారు.

వారి నుంచి 20 ఎర్రచందనం దుంగలు, వాహనం చెట్లను నరికే ఆయుధాల స్వాధీనం చేసుకున్నామన్నారు. సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, శివంజనేయులు రెడ్డిలను స్మగ్లర్లుగా గుర్తించామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఎర్రచందనం స్మగ్లింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు అక్రమంగా ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న 11మంది స్మగ్లర్లపై పీడీ యాక్ట్‌లు నమోదు చేసినట్లు వివరించారు. మళ్లీ కరోన తీవ్రత పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలందరూ మాస్క్ వేసుకోవాలి.. భౌతిక దూరం పాటించాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు.

సర్పంచ్‌లకు అందని బాధ్యతలు

ప్రమాణస్వీకారోత్సవం కోసం ఎదురుచూపులు
చెక్ పవర్‌పై ఇప్పటికే ఊహాగానాలు

విజయవాడ,మార్చి27(ఆర్ఎన్ఎ): జిల్లాల్లో రెండు నెలల కిందట పంచాయతీ ఎన్నికల పక్రియ పూర్తయినా వారికి బాధ్యతల అప్పగించలేదు. సర్పంచి ఎన్నిక పూర్తవగానే ఉపసర్పంచి ఎన్నిక జరిపి, వారితో ప్రమాణ స్వీకారం చేయించడం ఆనవాయితీ. కానీ ఇంతవరకు ప్రమాణ స్వీకారంపై ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ఎన్నికైన వారంతా పగ్గాలు ఎప్పుడు చేతికిస్తారో అని ఎదురుచూస్తున్నారు. ఎన్నికలు జరగని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. కొన్ని గ్రామాల్లో వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారానికి ముందే మృఇ చెందారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు కార్యాలయాలకు వెళుతున్నారు. కొన్ని గ్రామాలలో తాగునీరు, మురుగుకాలువలు మరమ్మతులు వంటి చిన్నచిన్న సమస్యలను కొత్త సర్పంచ్‌లు చేపట్టి పరిష్కరిస్తున్నారు. కొన్ని చోట్ల సర్పంచ్‌లు వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులను వెంటబెట్టు పర్యటిస్తున్నారు. కొత్త సర్పంచ్‌లు చేస్తున్న పనులను ప్రత్యేకాధికారులు మినిట్‌బుక్‌లో నమోదు చేస్తున్నారు. టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నేతలు గెలుపొందిన చోట అక్కడున్న వైసీపీ నేతల ఆదేశాల మేరకే వ్యవహరిస్తున్నారు. గ్రామ పంచాయతీలో 2021-22 బ్జడెట్‌ను తయారు చెయాల్సి వుంది. ప్రత్యేకాధికారులు ఇప్పటికే బ్జడెట్‌ను రూపొందించారు. కొత్తపాలక వర్గాల సూచనలు, పంచాయతీ తీర్మానం మేరకు అధికారులు బ్జడెట్‌ను తయారు చేస్తారు. ఇంతవరకు ప్రభుత్వ ఆదేశాలు లేకపోవటంతో కార్యదర్శులు, ఈవోపీఆర్‌డీలు కొత్త సర్పంచ్‌లతో సంప్రదించటానికి తటపటాయిస్తున్నారు.

మరోవైపు గ్రామాల్లో 14, 15వ ఆర్థిక సంఘం నిధులను నెలాఖరులోపు ఖర్చు చేయకపోతే మురిగి పోతాయని ఇంజనీరింగ్ సిబ్బంది చెబుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనకు ఎప్పుడు ముగింపు పలుకు తారని ప్రజలు కూడా ఎదురు చూస్తున్నారు. ఎన్నో ఆశలతో మరెన్నో ఆకాంక్షలతో సర్పంచ్‌లుగా ప్రమాణ స్వీకారం చేసిన వారంతా ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. గతంలో సర్పంచ్‌లు చెక్ పవర్‌తో అధికారాన్ని అనుభవిస్తూ పల్లె పాలన కొనసాగించారు. ప్రస్తుతం చెక్ పవర్‌తో కూడిన బాధ్యతలను ప్రభుత్వం అప్పగిస్తుందన్న ఆశతో సర్పంచ్‌లు ఎదురుచూస్తున్నారు. ఎన్నికైన సర్పంచ్‌లంతా మంచి రోజులు చూసుకుని ఇప్పటికే ప్రమాణ స్వీకారాలు చేశారు. సర్పంచ్ సీట్లలో ఆశీనులయ్యారు. కానీ బాధ్యతలు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నారు. పాలకవర్గం ఉన్నాసరే లేనట్టే వ్యవహరించాల్సి వస్తోంది. ప్రతి ఏటా పంచాయతీలకు మార్చి నెల అత్యంత కీలకం. వేసవి ప్రణాళికను సిద్ధం చేసుకుంటారు. మంచినీటి సమస్య లేకుండా చూస్తారు. వేసవిలో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తారు. ఉపాధి హామీ పనులకు ఆమోద ముద్ర వేస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్‌లంతా ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఆర్థిక సంఘం నిధులు మార్చి మాసాంతానికి వెచ్చించాలి. ఇప్పటికే సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగిస్తే గ్రామాలకు అవసరమైన వసతులు, అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవడానికి అవకాశం లభించేది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో శాసనసభ్యుల సిఫారసులకే ప్రత్యేక అధికారులు పెద్దపీట వేస్తున్నారు. గ్రామాల్లో ప్రతిపక్ష పార్టీల సానుభూతి పరులు సర్పంచ్‌లుగా ఉంటే అధికార పార్టీనుంచి అవమానాలు ఎదుర్కొంటున్నారు. ఏ పదవులు లేని వారు కూడా అధికార పార్టీని అడ్డం పెట్టుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అటువంటి కార్యక్రమాలకు హాజరవుతున్నారు. అదే సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగిస్తే తమ కనుసన్నల్లోనే పనులు సాగేవి. ప్రస్తుతం ఆర్థిక సంఘం నిధులు మార్చి మాసాంతానికి వెచ్చించకపోతే మురిగిపోనున్నాయి. జిల్లాల్లో కోట్ల రూపాయల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో మండలంలో గరిష్టంగా రూ.4.00 కోట్ల వరకు ఆర్థిక సంఘం నిధులు వెచ్చించాల్సి ఉంది. సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగిస్తే ఆ నిధులన్నీ వారి సూచనమేరకే వెచ్చించే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం అధికారులే వేసవి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాలు ఉత్సవ విగ్రహాలుగానే మిగిలిపోయాయి. పారిశుధ్య పనులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. అదే పాలకవర్గాలు బాధ్యత తీసుకుంటే పర్యవేక్షణ ఉంటుంది. మరోవైపు చెక్ పవర్ విషయమై సర్పంచ్‌ల్లో చర్చసాగుతోంది. గతంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు సంయుక్తంగా చెక్ పవర్ ఉండేది. చెక్ పవర్‌లేని బాధ్యతలతో సర్పంచ్‌లకు విలువ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటోందనన్న గుబులు సర్పంచ్‌ల్లో నెలకొంది.

తిరుపతి ఉప ఎన్నికలో వేడెక్కిన రాజకీయం

అన్ని పార్టీల నుంచి రంగంలోకి దిగిన నేతలు
పార్టీ ప్రచారాల్లో బిజీగా ఆయా పార్టీల నాయకులు
ఎండవేడిమిలో హీటుకెక్కనున్న ప్రచారం

తిరుపతి,మార్చి27(ఆర్ఎన్ఎ): తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎవర్నది తేలడంతో ఇక రాజకీయంగా తిరుపతి వేడెక్కింది. కాంగ్రెస్ అభ్యర్థిని మాత్రమే అధికారికంగా ప్రకటించాల్సి ఉండగా... మాజీ ఎంపి చింతామోహన్ పేరునే అధిష్టానం కరారు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. తనకే టిక్కట్ అంటూ చింతా ఇప్పటికే ప్రచారంలో ముందుకు పోతున్నారు. టిడిపి నుంచి పనబాక లక్ష్మి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. ఇకపోతే వైకాపా అభ్యర్థిగా డాక్రట్ గురుమూర్తి, బీజేపీ అభ్యర్థిగా విశ్రాంత ఐఏఎస్ రత్నప్రభ పేరును పార్టీలు ప్రకటించాయి. ప్రకాశం జిల్లాకు చెందిన రత్నప్రభ కర్ణాటక కేడర్‌లో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించి ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2018లో రిటైరైన రత్నప్రభ 2019లో బీజేపీలో చేరారు. దీంతో ఉప ఎన్నికల బరిలో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లు ఖరారైనట్టు అయ్యింది. టీడీపీ అభ్యర్థిగా పనబాక లక్ష్మి బుధవారం నామినేషన్ వేయగా, వైసీపీ అభ్యర్థి గురుమూర్తి సోమవారం నామినేషన్ వేయనున్నారు. రత్నప్రభ ఎప్పుడు నామినేషన్ వేస్తారనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు తిరుపతి ఉప ఎన్నికల ప్రచారం ఊపందుకుంది.టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి తిరుపతిలో ప్రచారం ప్రారంభించారు. ఉప ఎన్నికలను పురస్కరించుకుని వైసీపీ ప్రభుత్వ తీరును ప్రజలకు తెలియజెప్పి చైతన్యపరిచే ఉద్దేశంతో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుయువత ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్టు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు గురువారం ప్రకటించారు. వైసీపీ అభ్యర్థి గురుమూర్తి శ్రీకాళహస్తి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అక్కడి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ విషయానికొస్తే ఆ పార్టీ తరపున జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, యువమోర్చా నాయకుడు దాము తదితరులు తాతయ్యగుంట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ నగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొత్తంగా తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీల మంత్రాంగాలు జోరందుకుం టున్నాయి.కాంగ్రెస్ అభ్యర్థిగా చింతా మోహన్ పేరును ఖరారు చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం శుక్రవారం ప్రకటన జారీ చేసింది. 1984లో తొలిసారి తిరుపతి నుంచే లోక్‌సభకు పోటీ చేసిన చింతా మోహన్ పదవసారి ఎన్నికల బరిలో నిలబడుతున్నారు. తొలిసారి టీడీపీ తరపున పోటీ చేసిన చింతా తర్వాత 8 సార్లు కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. టీడీపీ నుంచీ ఒకసారి, కాంగ్రెస్ నుంచీ ఐదుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఓ పర్యాయం కేంద్ర సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. 1984 నుంచీ 2019 వరకూ పదిసార్లు ఎన్నికలు జరగగా 1996లో ఒకసారి మాత్రమే ఆయనకు కాంగ్రెస్ టికెట్ దక్కలేదు. తిరుపతి ఉప ఎన్నికల్లో పార్టీ నిర్ణయంతో ప్రమేయం లేకుండా ఎన్నికల షెడ్యూలు వెలువడిన నాటి నుంచీ ఆయన ఎన్నికల ప్రచారంలోకి దిగారు. తిరుపతి నగరం జీవకోన ప్రాంతంలో టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీధుల్లో కాలినడకన తిరిగిన ఆమె ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు వేయాల్సిందిగా అభ్యర్థించారు.ఎమ్మెల్సీలు సత్యనారాయణరాజు, బత్యాల చెంగల్రాయులు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, ముఖ్యనేతలు శ్రీధర్ వర్మ, ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు ఆమె వెంట వున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండల వైసీపీ శ్రేణులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఉప ఎన్నికల్లో మండలం నుంచీ పార్టీ అభ్యర్థి గురుమూర్తికి భారీ మెజారిటీ రావాలని లక్ష్యం నిర్దేశిరచారు. టీడీపీకి సంబంధించి మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, విజయనగరం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు తొట్టంబేడు మండల బూత్ కమిటీలతో సమావేశమయ్యారు. పార్టీ పరిస్థితితో పాటు ప్రత్యర్థి పార్టీ గురించి కూడా వివరాలు సేకరించారు. ఉప ఎన్నికల్లో ఇంటింటి ప్రచారానికి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు.బీజేపీకి సంబంధించి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణుకుమార్‌రెడ్డి తదితరులు శ్రీకాళహస్తి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఉప ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసే ప్రయత్నం చేశారు.బీజేపీ అభ్యర్థి రత్నప్రభ శుక్రవారం హైదరాబాదులో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిసి ప్రచారంలో పాల్గొని తన గెలుపుకు సహాయపడాలని కోరినట్టు సమాచారం. తిరుపతి ఉప ఎన్నికల్లో బీజేపీ టికెట్ కోసం తీవ్రంగా యత్నించిన డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు నివాసానికి శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వెళ్లి సహకారం అభ్యర్థించారు. మొత్తానికి ఈ ఎన్నికల వేడిలో అభ్యర్థులు పార్టీ నేతలు తడిసి ముద్దవ్వడం కాయం.

ప్రత్యేకహోదా ఇక ముగిసిన అధ్యాయం

రాజకీయ పార్టీల డ్రామాలతో శాశ్వతంగా భూస్థాపితం
చిత్తశుద్ధి కొరవడిన కేంద్ర ప్రభుత్వం

విజయవాడ,మార్చి27(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాపై రాజకీయ పార్టీలు పార్లమెంటులో ప్రస్తావించడం..భంగపడం రివాజుగా మారింది. తెలుగుదేశంతో సహా వైకాపా కూడా ఇదే పనిచేస్తోంది. ఒక్క బీజేపీ మినహా ప్రతివారూ ఏదో రూపంలో ప్రత్యేక హోదాను ప్రస్తావిస్తూనే ఉన్నారు. అయితే మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో మరోమారు కేంద్రం తెగేసి చెప్పింది. ప్రత్యేకమోదా లేదని బల్లగుద్ది మరీ చెప్పింది. దీంతో ఇక హోదాను మరిచి పోవడం లేదా..రణం చేయడమా అన్నది పార్టీల నేతలు నిర్ణయించుకోవాలి. ప్రత్యేక హోదా సమస్యను శాశ్వతంగా భూస్థాపితం చేశారు. పార్లమెంటులో కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ టిడిపి ఎంపి రామ్మోహన్ నాయుడు ప్రశ్నపై మరోసారి ప్రత్యేక హోదా లేదంటూ చేసిన ప్రకటనతో మరోమారు చర్చకు వచ్చింది. హోదా ముగిసిన అధ్యాయం... ఇంకా దీనిపై మాట్లాడ్డ మెందుకు అనేది బిజెపి తెగేసి చెప్పింది. ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరంటే 14వ ఆర్థిక సంఘం వద్దన్నదని తాజాగా నిత్యానంద చెప్పడంతో తమకు ఇష్టం లేదని బిజెపి నేతలు చెప్పేశారు. 2013లో 14వ ఆర్థిక సంఘం ఏర్పడిరది! దానికి ఇచ్చిన ప్రస్తావనాంశాలో (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్) హోదా విషయమే లేదు. ఆ సంఘం అధ్యక్షుడుగా పనిచేసిన తెలుగు ప్రముఖుడు, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ వైవిరెడ్డి స్వయానా చెప్పారీ మాట. ప్రణాళికా సంఘం ఇవ్వాల్సింది గాని అది రద్దయిపోయింది ఏం చేస్తామని మరో నిట్టూర్పు. ప్రభుత్వ వ్యవహారాలలో ఏదైనా వ్యవస్థను రద్దు చేస్తున్నప్పుడు దానివల్ల ప్రయోజనం పొందేవారికి ముందు భద్రత భరోసా కల్పించడం జరుగుతుంటుంది. హేమాహేమీలకు ఈ ప్రణాళికా సంఘం స్థానంలో నీటి ఆయోగ్ వచ్చింది. అది నిర్ణయం తీసుకుంటుందని చాలా కాలం చెప్పారు. చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు కూడా అదే నమ్మబలికారు. తీరా చూస్తే నీటి ఆయోగ్ గత ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా తమకూ హోదాకు ఏ సంబంధం లేదని హైదరాబాదులోనే చెప్పారు. దాని అధ్యక్షుడేమో ప్రధాని మోడీయే. ఆయన ఎన్నికల సభల్లో ఈ హామీ కురిపించారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలోనూ ప్రస్తావించారు. విభజన చట్టంలో ప్రత్యేక హోదా చేర్చకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పొరబాటు. మేమేం చేస్తాం అంటూ కమలనాథులు తప్పించుకుంటున్నారు. 2013 మార్చిలో అప్పటి కేంద్ర క్యాబినెట్ మన్మోహన్ సింగ్ అధ్యక్షతన సమావేశమై ప్రత్యేక హోదా హామీని ఆమలు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు మినిట్స్ కూడా నమోదు చేసింది. మోడీ ప్రభుత్వానికి రాజకీయ నిబద్ధత, రాజ్యాంగ బద్ధత లేకపోవడమే కారణంగా చూడాలి. చంద్రబాబు అధికారంలో ఉండగా మధ్యలో ప్యాకేజీ నాటకం నడిపారు గాని అది కూడా అమలు కాలేదు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం కూడా ఈ విషయంలో గట్టిగా నిదీయడానికి సిద్ధంగా లేదు. మోడీకి పూర్తి మెజార్టి వుంది మనమేం చేస్తామని ప్రమాణస్వీకారం ముందే జగన్ చేతులెత్తేశారు. వాస్తవానికి విభజన సమయంలో ఎపికి ఇచ్చిన హామీ ఇదొక్కటే కాదు. రాజధాని నిర్మాణానికి సాయం, పోలవరం జాతీయ హోదా,కెబికె ప్యాకేజీ,వెనక బడిన ప్రాంతాలకు నిధులు, రెవెన్యూ లోటు భర్తీ, రామాయపట్నం రేవు,కడప ఉక్కు ఫ్యాక్టరీపై పరిశీలన వంటివెన్నో, కాని ఇందులో కొన్ని పాక్షికంగా అమలైతే మరికొన్ని అసలు వూసే లేకుండా పోయాయి. వీటిపై నిలదీసే ధైర్యం అటు ప్రభుత్వంలో ఉన్న పార్టీకి ఇటు ప్రిపక్ష పార్టీలకు లేకుండా పోయింది. ఇక అధికారం మాదే అంటున్న బిజెపి నంగనాచి కబుర్లతో తప్పించుకుంటోంది.

సీఎం నిర్ణయాలతో రాష్ట్రం సస్యశ్యామలం, సుసంపన్నం

వరంగల్ రూరల్,మార్చి27: ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్రం సస్

విద్యాసంస్థలను పున:ప్రారంభించాలి..

– లేదంటే ప్రైవేటు అధ్యాపకులన్ని జీవన భృతి కల్పించాలి.
–ప్రైవేటు పాఠశాల, కళాశాలల అధ్యాపకులు

రాజన్న సిరిసిల్ల, మార్చి 27: (నేటినిజం ప్రతినిధి):కరోనా నైపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న పాఠశాలలు, కళాశాలలు మూసివేత నిర్ణయంతో తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తూ ,విద్యాసంస్థలను పున:ప్రారంభించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల కేంద్రంలో ప్రైవేటు విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ చౌక్ నుండి కలెక్టరేట్ కార్యాలయంలోవరకు వెళ్లి వేటు ఉపాధ్యాయులకు నిరుద్యోగ భృతి కల్పిస్తూ పాఠశాలలు' కళాశాలలు వెంటనే తెరవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ప్రైవేటు విద్యా విద్యాసంస్థల బంద్ చేయడం సమంజసం కాదని, మిగతా అన్ని రంగాల్లో బాగు పడ్డాయి కానీ ఒక విద్యా రంగం మాత్రం బాగు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తి బార్లు, సినిమా హాల్లో కాకుండా ఒక విద్యాసంస్థల ద్వారానే వ్యాప్తిచందుతుందా ..ఆని.. ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత సంవత్సరం కరోనా తో పాఠశాలలు, కళాశాలలు మూత పడడంతో అధ్యాపకుల రోడ్డున పడ్డారని ,చేతిలో చిల్లిగవ్వ లేక వారి కుటుంబాలు చితికిపోయారని ,ఏపని దొరికితే దాన్ని చేసి బతుకుబండిని లాగించారని ,ఇప్పుడు విద్యాసంస్థలు ప్రారంభించి నెల కూడా కాలేదని,మళ్ళీ విద్యాసంస్థలు మూతపడితే వాళ్ళ బతుకులు ఆగమైతాయని ఆవేదన వ్యక్తంచేశార. జాతీయ స్థాయిలో నిర్వహించే కాంపిటేటివ్ ఎగ్జామ్ కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు నష్టపోతారని,దానిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు భవిష్యత్తు ను కాపాడానికి విద్యాసంస్థలను పున:ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరొనా విపత్కర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు అధ్యాపకులు జీవన భృతి అందించాలని ,అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పించాలనికోరారు .ఈ కార్యక్రమంలో గుర్రం ఆంజనేయులు వంగపల్లి రాజేష్, విశాల్ 'ప్రైవేట్ అధ్యాపకులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది

షబే బరాత్.. హోలీ వేడుకలకు ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం

రాజన్న సిరిసిల్ల, మార్చి 27: (నేటినిజం ప్రతినిధి): షబే బరాత్, హోలీ పండుగలను పురస్కరించుకుని నగర పాలక సంస్థ ద్వారా తగు ఏర్పాట్లు చేయాలని ఎంఐఎం పార్టీ పక్షాన ఆపార్టీ నేతలు మున్సిపల్ కమిషనర్ వల్లూరు క్రాంతి కి శనివారం వినతిపత్రం అందజేశారు. షబే బరాత్ (జాగారం) ఆదివారం రోజు అవుతుండటంతో రాత్రి వేళ ముస్లింలు మస్జిద్ లలో ప్రత్యేక ప్రార్థనలు చేసి వారి కుటుంబ సభ్యులు, పూర్వికుల సమాధులను సందర్శించడం కోసం ఖబ్రస్థాన్ లకు వెళ్లడం అనాదిగా ఆనవాయితీగా వస్తోందని, ఇందుకోసం ఖబ్రస్థాన్ లను శుభ్ర పరచాలని, ఫోకస్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం రోజున హిందూ సోదరుల పవిత్రమైన హోళీ పండుగ సందర్భంగా మున్సిపల్ నల్లా నీటిని గంటసేపు ఎక్కువ గా వదిలి పెట్టాలని ఎంఐఎం పార్టీ పక్షాన నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, కార్పొరేటర్లతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, మహమ్మద్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలిబాబా, అజహర్ దబీర్ తదితరులు ఉన్నారు.

ఖబ్రస్థాన్ మేనేజ్మెంట్ కమిటీఅధ్యక్షుడు మసూద్ ఖాన్ గుండెపోటుతో హఠాన్మరణం

–పలువురు రాజకీయ ప్రముఖుల సంతాపం



కరీంనగర్, మార్చి 27: (నేటినిజం ప్రతినిధి):రియల్ ఎస్టేట్ అధినేత, కరీంనగర్ బైపాస్ రోడ్ ఖబ్రస్థాన్ మేనేజ్మెంట్ కమిటీ, మస్జిద్ అప్జల్ బియబాని అధ్యక్షుడు అల్ హాజ్ మహమ్మద్ మసూద్ ఖాన్ (70) శుక్రవారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో మసూద్ ఖాన్ కు హౌసింగ్ బోర్డు లోని ఆయన నివాసంలో గుండె పోటు వచ్చింది. వెంటనే నగరంలోని ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలపడంతో ఉన్నత చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళుతుండగా మార్గ మధ్యలో చనిపోయారు. మసూద్ ఖాన్ భౌతికాయాన్ని బంధు మిత్రుల సందర్శన కోసం ఆయన నివాసంలో ఉంచారు. శనివారం మధ్యాహ్నం జామ మస్జీద్ లో జనాజా (అంతిమ) నమాజ్, ప్రత్యేక ప్రార్థనల అనంతరం బైపాస్ రోడ్ ఖబ్రస్థాన్ లో ఇస్లామిక్ సాంప్రదాయ బద్ధంగా ఖననం చేశారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సౌమ్యుడిగా, నీతి నిజాయితీకీ మారుపేరు గా మసూద్ ఖాన్ ఆదర్శంగా నిలిచారని, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, కరీంనగర్ లోని పురాతన జామ మస్జీద్ ఉపాధ్యక్షుడిగా, పెద్దపల్లి బైపాస్ రోడ్ పెద్ద ఖబ్రస్థాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడిగా ఖాన్ సేవలందించారని, మస్జిద్ అప్జల్ బియబాని నిర్మాణం లో తనవంతు సహాయ సహకారాలు అందించారని ఆయన జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ పలువురు రాజకీయ ప్రముఖులు ఆయన సేవలను, మంచి పనులను కొనియాడారు. రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాల కిషన్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామ కృష్ణారెడ్డి, సిద్ధిపేట జడ్పి వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, ఇల్లంతకుంట ఎంపిపి ఊట్కూరి వెంకట రమణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్లు గుగ్గిల్లపు రమేశ్, అబ్బాస్ సమి, ఎంఐఎం సహాయ కార్యదర్శి సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, కార్పొరేటర్లు బర్కత్ అలీ, శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, ఆతిన, అలిబాబా, అజహర్ దబీర్, ఆకుల ప్రకాశ్ తదితరులు సంతాపం తెలిపారు. మసూద్ ఖాన్ కుమారుడు అంజత్ ఖాన్ ముజ్జు ను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రతి కేసులో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ పోలీస్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్పీ శ్రీ రాహుల్ హెగ్డే

–పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ
–డయల్ 100 కాల్స్ పట్ల వేగవంతంగా స్పందించాలి

రాజన్న సిరిసిల్ల, మార్చి 27: (నేటినిజం ప్రతినిధి):ప్రతి కేసులోనిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ పోలీస్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు .శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్ష సమావేశంనిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ కేసులలోని వివరాలన్నింటినీ ఆన్లైన్లో నిక్షిప్తం చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు.నేరస్తులకు శిక్షలు పడే విధంగా చేసి శిక్షా రేటును పెంచాలని తెలియ జేసారు.సిబ్బంది సెలవులను మరియు ఇతర అర్జీలను ఆన్లైన్ ద్వారా పొందే విధంగా అధికారులందరూ వారికి హెచ్ ఆర్ ఎమ్మెస్ పై అవగాహన కల్పించాలని తెలియజే సారు. ఇ – చలనా ద్వారా రోడ్డు భద్రతా నియమాలను అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి,పట్టుబడిన వ్యక్తుల యొక్క లైసెన్సులను రద్దు చేయించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరాలను అదుపు చేసే విధంగా పనిచేయాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు రాజీ పడవద్దని సూచించారు. గుట్కా మట్కా మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, పోలీసులపై మరింత నమ్మకాన్ని పెంపొందించేలా బాధ్యతగా పనిచేయాలని కోరారు. పోలీస్స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.దొంగతనాల కేసుల్లో నిందితులను పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేకూరే విధంగా పోలీసు శాఖలో ఉన్న సాంకేతిక తను వినియోగించుకోవాలని సూచించారు. మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన షీ టీం ఆవశ్యకతను గురించి అవగాహనా కార్యక్రమాల్ని ఏర్పాటు చేయాలని తెలిపారు.సైబర్ క్రైమ్స్ బారినపడకుండా జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రతి పోలీస్స్టేషన్ పరిదిలో ప్రతి గ్రామంలో సి.సి.కెమెరాల ఏర్పాటుకు ప్రజలలో చైతన్యం పెంపొందించేందుకు కళా బృందం కార్యక్రామాల ద్వారా సి సి కెమెరాల ప్రాముఖ్యత ప్రజలకు తెలియజేయాలని వాటిని అమర్చుటకు కృషిచేయాలని, సి సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలు తగ్గడమే కాకుండా కేసులను ఛేదించడం లో ప్రముఖ పాత్ర వహిస్తాయని చెప్పారు.మహిళల భద్రత కొరకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, పొక్సో కేసులలో విచారణ వేగవంతం చేయాలని, పోలీసు కళాబృందం, షీ టీమ్స్ ద్వారా ప్రజలకు,విద్యార్థులకు, విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని. అత్యవసర సమయంలో ప్రజలు వినియోగించే డయల్ 100 కాల్స్ పట్ల వేగవంతం అయినా స్పందన తప్పక ఇవ్వాలని, తక్కువ సమయసీ లో సంఘటన ప్రదేశానికి బ్లూ కోల్ట్స్ లేదా పెట్రో కార్స్ ద్వారా చేరి సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

–13 మంది పోలీస్ లకు అవార్డులు×

గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు కీ పెర్ఫార్మన్స్ ఇండికేట్ అవార్డులు ఎస్పీ రాహుల్ హెగ్డే గారు ఈ సందర్భంగా అందజేశారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో లో ప్రత్యేకంగా అభిన దించారు. అవార్డులను అందుకున్న వారిలోఅభిలాష్ ఎస్.ఐ ఆఫ్ పోలీస్. శిరీష (రిసెప్షనిస్టు) తంగలపల్లి పోలీస్ స్టేషన్ . రాజు (రైటర్) వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ కమలేష్ (బ్లూ కోల్ట్స్) వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్,శివ ప్రసాద్ (కోర్ట్ డ్యూటీ ఆఫీసర్) ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్.సురేష్ (వారెంట్ అండ్ సమన్స్) ఇల్లంతకుంటా పోలీస్ స్టేషన్ శ్రీనివాస్(టెక్ టీమ్)వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్,రవి (క్రైమ్ స్టాఫ్)వేములవాడ రూరల్ పోలీస్ స్టేషనచంద్రశేఖర్ (జనరల్ డ్యూటీ ఆఫీసర్) తంగలపల్లి పోలీస్ స్టేషన్.సంతోష్ ఏ. ఎస్.ఐ (ప్రింగర్ ప్రింట్) రాజన్న సిరిసిల్లరామచంద్రమ్ (డి. పి.ఓ)వెంకట రమణ (ఐ. టి కోర్)రాజేష్ (ఐ.టి కోర్)ఈ సమావేశంలో డిఎస్పీ చంద్రకాంత్ సి.ఐ లు వెంకటేష్,బన్సీలాల్,శ్రీలత,రవికుమార్, ఆర్.ఐ లు రజినీకాంత్,కుమారస్వామి,ఎస్.ఐ లు ఐ.టి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైమానిక నేత్ర నిఘా - డ్రోన్ టెక్నాలజీ...!

నాటి పాతరాతి యుగం నుంచి నేటి అత్యాధునిక డిజిటల్ నానో యుగం వరకు శాస్త్రసాంకేతికశాస్త్ర అనూహ్య ప్రగతి మానవాళి జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. వైజ్ఞానిక కల్పిత సినిమాలు, సాహిత్యరంగాల్లో కనిపించే ఊహాజనిత టెక్నాలజీలను నేటి ఆధునిక డిజిటన్ నిపుణుడు సుసాధ్యం చేయడంతో పాటు ఇలాంటి డిజిటల్ టెక్నాలజీలను మానవాళి సేవల్లో వినియోగించడం చూస్తున్నాం. గగనసీమలో విహరిస్తూ, భూతలంపై జరుగుతున్న మానవ కదలికల్ని వైమానిక త్రినేత్రంతో చేరవేసే అమూల్య పర్యవేక్షక సేవలను అందించే గురుతర బాధ్యతలను నేటి ఆధునిక నిఘా 'డ్రోన్' వ్యవస్థ నిర్వహిస్తున్నది. అమెరికాకు చెందిన అబ్రహన్ కరీమ్ కనుగొన్న డ్రోన్ టెక్నాలజీ ఉపయోగాలు నాటి నాటికి పెరగడం చూస్తున్నాం. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజారోగ్యం, భూతల విభిన్న స్థితులు మరియు దేశ రక్షణ వరకు డ్రోన్ టెక్నాలజీ చేస్తున్న అమూల్య సేవలు ప్రశంసనీయంగా ఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రారంభ కావలసిన 'డ్రోన్ టెక్నాలజీ' సేవలను భారతదేశంలో తొలిసారి సమర్థవంతంగా వినియోగించడం హర్షదాయకం. మన చేతిలోని స్మార్ట్ ఫోన్ల నుంచి అత్యాధునిక రోబోటిక్స్ వరకు ఉప్పెనలా వెల్లువెత్తిన శాస్త్రసాంకేతిక విప్లవ ఫలాలు మన జీవనశైలిని సమూలంగా మార్చడం అబ్బురపడుతూ చూస్తున్నాం. ఈ అత్యాధునిక టెక్నాలజీ అందించిన మరో అద్భుత ఆవిష్కరణగా 'డ్రోన్ లేదా మానవరహిత వైమానిక నిఘా వాహనం (అన్మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్)' నేటి కరోనా మహమ్మారి కాలంలో మంచి వరంగా వాడబడుతున్నది. డ్రోన్ టెక్నాలజీతో ఖచ్చితత్వం, నాణ్యతగల సమాచారం, సులభ నియంత్రణ/వాడకం, భద్రత, సురక్షిత, గోప్యత, చవక, 3డి మ్యాపింగ్, ప్రమాదకర ప్రజేశాల్లో ఉపయోగం, పర్యావరణ పరిరక్షణ, మిలిటరీ వినియోగం, ప్రాణాల రక్షణ లాంటి పలు అనుకూలతలు ఉన్నాయి. మానవాళి క్షేమం కోసం బహుముఖీన అనువర్తనాలతో డ్రోన్ స్వదేశీ టెక్నాలజీ దేశ నలుమూలల వినియోగించ బడుతున్నది. కోవిడ్–19 నేపథ్యంలో వ్యాధుల చికిత్స, బహిరంగ పబ్లిక్ ప్రదేశాల్లో సానిటైజేషన్, సరుకుల హోమ్ డెలివరీ, ప్రజారోగ్య పరిరక్షణ, అసాంఘీక శక్తుల కట్టడి, సన్నివేశాల ప్రత్యక్ష ప్రసారం, ప్రమాదకర ప్రదేశాల్లో కూడా గోప్యంగా నిఘా, దేశ భద్రత మరియు రక్షణ, ఉగ్రవాద కదలికల్ని పసిగట్టడం, వాణిజ్య ప్రకటనలు మరియు సినిమాల నిర్మాణాలు, వన్యప్రాణుల కదలికలు గమనించడం లాంటి పలు ముఖ్య రంగాల్లో మిలియన్ల జనుల సంక్షేమం కోసం నేడు డ్రోన్లు విజయవంతంగా వాడబడుతున్నాయి. రిమోట్ కంట్రోల్ డ్రోన్ల సహాయంతో మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందించడం జరుగుతోంది. ఇప్పటికే పలు పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అతి తక్కువ సమయంలో ఔషధాలు, రక్త యూనిట్లు, వైద్య సూచనలు చేరవేయడం సాధారణం అయ్యింది. మారుమూల ప్రాంత ప్రజలకు వైద్య సహాయం (ఔషధాలు, రక్తం లాంటి అత్యవసరాలు) చేర్చడానికి 4 – 6 గంటల సమయం పట్టే స్థితి నుంచి నేడు డ్రోన్ల వినియోగంతో 15 నిమిషాల్లో వైద్య సహాయం అందుతోంది. మారుమూల ప్రజల అనారోగ్యాలను సెల్ మెసేజీల ద్వారా తెలుసుకొని, వెంటనే అత్యవసర సేవలను 'డ్రోన్ క్లినిక్'ల సహాయంతో నిమిషాల్లో చేరవేసే స్థితికి సాంకేతిక పరిజ్ఞానం ముందడుగు వేసింది. కరోనా కల్లోల సమయాన డ్రోన్లు చేస్తున్న అమూల్య సేవలను ప్రపంచవ్యాప్త వైద్య సిబ్బంది, నిపుణులు కొనియాడడం జరుగుతున్నది. దూర ప్రాంత ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తం అందించడం డ్రోన్ల వినియోగంతో సులభమైంది. కరోనా కాలంలో సామాజిక దూరాలు పాటించడం, సమూహాలుగా గుమికూడడం, మానవ కదలికల గుర్తింపు, కంటేయిన్‌మెంట్ ప్రదేశాల పర్యవేక్షణ, ఆటోమేటెడ్ డ్రోన్లతో సానిటైజర్లను స్ప్రే చేయడం లాంటి ముఖ్యమైన విధులను డ్రోన్ టెక్నాలజీ నిర్వహిస్తున్నది.

ఇండియాలో డ్రోన్ల వినియోగం విరివిగా, అర్థవంతంగా, సమర్థవంతంగా జరుగుతున్నది. ఆరోగ్య పరిరక్షణ, గగనతలం నుంచి నిఘా, మ్యాపింగ్, దేశ భద్రత మరియు రక్షణ విధులకు డ్రోన్లు ఉపయోగపడుతున్నవి. డ్రోన్ల శక్తిసామర్థ్యాలను సమర్థవంతంగా వాడుకోవడంలో భారత్ సఫలీకృతం అవుతున్నది. విభిన్న సంక్లిష్ట సమస్యలతో సతమతం అవుతున్న భారత్‌లో మిలియన్ల గిరిజన గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య ప్రదాతగా డ్రోన్ల సేవలు కొనియాడబడుతున్నవి. ఇటీవల భారత కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'స్వమిత్వ యోజన' ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద డ్రోన్–ఆధార ప్రాజెక్టును చేపట్టుటతో 6 లక్షల గ్రామాల్లో డ్రోన్ల సహాయంతో సర్వేలు మరియు మ్యాపింగ్ జరుగుతోంది. సాంప్రదాయ విధానంలో అసాధ్యమనిపించే ప్రజా సేవలను కొద్ది నిమిషాల్లో పూర్తి చేయడానికి 'మేకిన్ ఇన్ ఇండియా' స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగపడడం సంతోషదాయకం. రాబోయే రోజుల్లో దేశ ప్రజలకు డ్రోన్ టెక్నాలజీ మరింత మేలైన సేవలను చేయాలని కోరుకుందాం. ఇలాంటి స్వదేశీ టెక్నాలజీలను సామాన్యులకు చేరువ చేస్తున్న భారతీయ సాంకేతిక నిపుణులను మనస్ఫూర్తిగా కొనియాడుదాం. డిజిటల్ విప్లవంతో స్వదేశీ పరిజ్ఞానాన్ని రూపొందించుకొని 'ఆత్మనిర్భర భారత్'ను ఆవిష్కరిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఉపాధి లక్ష్యంగా మత్స్యకారులకు ప్రోత్సాహం

చేపలను ఎగుమతి చేసే దిశగా ఎదుగిన తెలంగాణ
మోబైల్ ఫిష్ వాహనాలకు జెండా ఊపిన మంత్రులు

హైదరాబాద్,మార్చి27(ఆర్ఎన్ఎ): ఫిష్ ఔట్ లెట్స్‌తో సిటీ ప్రజలకు ఇక నుంచి ఆరోగ్య పుష్టి దొరుకుతుందని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. శనివారం నెక్లెస్‌రోడ్ హెచ్ఎండీ గ్రౌండ్స్‌లో మొబైల్ ఫిష్ ఔట్ లెట్స్ వెహికల్స్‌ను మంత్రులు హరీష్‌రావు, తలసాని ప్రారంభించారు. జీహెచ్ఎంసీ, 29 జిల్లాలకు కలిపి 117 సంచార చేపల విక్రయ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ మాట్లాడుతూ తెలంగాణ రాకముందు మత్స్య పరిశ్రమ అంటే కోస్తా పరిశ్రమగా ఉండేదన్నారు. తెలంగాణ ప్రజల మనసు ఎంత బాగుంటుందో.. ఇక్కడి చేప కూడా అంత రుచిగా ఉంటుందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టుల్లో నీళ్లు.. చెరువులోకి వచ్చేది కాదని అన్నారు. కానీ సిఎం కెసిఆర్ ముందుగా చెరువల్లో నీరు నింపాలని ఆదేశించారని అన్నారు. త్వరలోనే ప్రభుత్వం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ప్రారంభించనుందని తెలిపారు.

ఈ మేరకు సిఎం అసెంబ్లీలో చేసిన ప్రకటనను గుర్తు చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి రూ.100 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒకప్పుడు చేపలు దిగుమతి చేసుకునేవాళ్ళమని.. ఇప్పుడు ఎగుమతి చేసే దిశగా వెళ్తున్నామని మంత్రి హరీష్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మత్స్యకారులను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. మత్స్యకారులు ఖాళీగా ఉండకుండా పని కల్పించాలనే ఉద్దేశంతో సంచార చేపల విక్రయ వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యకారుల గురించి ఎవరూ ఆలోచించలేదు.

వారికి కనీసం నిధులు కేటాయించలేదు. కానీ సీఎం కేసీఆర్ గొప్ప మనసుతో బడ్జెట్‌లో వారి కోసం రూ. 100 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో మత్స్యకారుల సంపదను పెంచుతున్నామని తెలిపారు. మహిళ మత్స్యకారులకు ప్రోత్సాహంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

ఇవాళ పంపిణీ చేసిన వాహనాలను మహిళల పేరుమీదనే ఇస్తున్నామని మంత్రి తలసాని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, అరికెపుడి గాంధీ, భేతి సుభాష్ రెడ్డి, ఎంపీలు బండ ప్రకాష్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బిబి పాటిల్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, డిప్యూటీ మేయర్ శ్రీలత, స్థానిక కార్పొరేటర్ విజయా రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్ గుప్త ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేములవాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

–అధ్యక్షుడిగా పిట్టల భూమేష్

రాజన్న సిరిసిల్ల, మార్చి 27: (నేటినిజం ప్రతినిధి):వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం వారి కార్యాలయంలో రసవత్తరంగా సాగాయి. ఏడాదికి ఒకసారి ఎన్నికలు జరగాల్సి ఉండగా, గతేడాది కరోనా, లాక్‌డౌన్ కారణంగా ఎన్నికలు నిర్వహించలేదు. ఈ ఏడాది అధ్యక్ష పదవికి పిట్టల మనోహర్, పిట్టల భూమేష్ లు పోటీ పడ్డారు.

దీంతో ఎన్నికల అధికారి రేగుల దేవేందర్ పోలింగ్ నిర్వహించారు. మొత్తం 85 ఓట్లకు గాను 79 పోలయ్యాయి. పిట్టల భూమేష్ కు 48 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మనోహర్ కు 31 ఓట్లు వచ్చాయి. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శిగా పెంట రాజు, సంయుక్త కార్యదర్శిగా గడ్డం సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా దివాకర్, లైబ్రరీ సెక్రటరీగా సంటి సృజీవన్ ,క్రీడా కార్యదర్శిగా రజనీకాంత్, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా గుజ్జ మనోహర్, బొజ్జ మహేందర్, బొడ్డు ప్రశాంత్, జూనియర్ కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, కాతుబండ నర్సింగరావు, రెగుల రాజ్ కుమార్ లు ఎన్నికయ్యారు.

నా బడి కోసం" మొబైల్ యాప్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్, మార్చి 27: మీరు చదువుకున్న బడిని బాగు చేయదలుచుకున్నారా? మీరు చదువుకున్న బడి అంటే మీకు ఇష్టమా? అయితే బడి బాగు కోసం మీ వంతు సహకారం అందించాలనుకుంటున్నారా? చదువుకున్న బడి రుణం తీర్చుకోవడానికి "నా బడి కోసం" మొబైల్ యాప్ సిద్ధంగా ఉందని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట రావు తెలిపారు. శనివారం జిల్లా విద్యాశాఖ, జిల్లా ఇన్ఫర్మేటిక్ సెంటర్ ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన నా బడి కోసం మొబైల్ యాప్ ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.

ఇంటింటికి వందా.. బడికి చందా కు కొనసాగింపుగానే..

జిల్లాలోని పాఠశాలల బాగు కోసం గతంలో ఇంటింటికీ వంద.. బడికి చందా కార్యక్రమం మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేశారు. దీనికి కొనసాగింపుగా ఇప్పుడు "నా బడి కోసం" మొబైల్ యాప్ ను ప్రారంభించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు, విదేశాలు, పట్టణాలు, నగరాలలో, ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారు చదివిన పాఠశాల బాగు కోసం ఏదైనా విరాళాలను ఇవ్వదలిస్తే "నా బడి కోసం" మొబైల్ యాప్ ద్వారా వారు ఉన్నచోటి నుండి విరాళాలను పంపవచ్చని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి..

ఇలా వచ్చిన విరాళాలతో పాఠశాలల కోసం ప్రత్యేకించి పాఠశాలల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తామన్నారు. కరోనా కారణంగా ప్రస్తుతం పాఠశాలలు మూసి వేసినప్పటికీ రాబోయే రోజుల్లో విద్యార్థులకు శానిటైజర్లు, మాస్కులు వంటివి తప్పనిసరి అవసరం అవుతాయని, విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థులు ఇచ్చే ఆర్థిక సహకారం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయిన తరువాత మొదటి ప్రాధాన్యత శానిటైజర్, మాస్కులు, కుర్చీలు, బెంచీలతో పాటు, ఇతర సౌకర్యాలకు ఉపయోగకరంగా ఉండేలా ఈ విరాళాలు ఉపయోగపడతాయని చెప్పారు.

పుస్తకావిష్కరణ మహోత్సవ

ఆహ్వానము

అక్షరకౌముది సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు
శ్రీ తులసి వెంకట రమణాచార్యులు గారు రచించిన
"మానస గీతం" కవితా సంపుటి మరియు
ప్రధాన కార్యదర్శి శ్రీమతి మూర్తి శ్రీదేవి గారు రచించిన
"సప్త వర్ణాలు" సమీక్షల సంపుటిల (రెండు పుస్తకాలు) ఆవిష్కరణ కార్యక్రమంకు
"అక్షర కౌముది సేవా సంస్థ" ఆహ్వానం పలుకుతుంది..

వేదిక:
డా॥ దేవులపల్లి రామానుజరావు కళా మందిరం
తెలంగాణ సారస్వత పరిషత్తు,
బొగ్గుల క